J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 40 సంచిక : 32 8.1.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
సంక్రాంతి శుభాకాంక్షలు. సం/-

### సంక్షేమ పథకాలతో, జన రంజక పాలనతో జగన్‌కి వస్తున్న ప్రజాదరణ చూసి కడుపుమంటతోనే...

# మత మంటగట్టి.. మంట పెడుతున్నారు

- ఖజానాలో కాసుల్లేవు.. అయినా ప్రజల ముంగిళ్ళకు సంక్షేమ పథకాలు చేరుతున్నాయి
- రాజధాని విషయంలో స్పష్టత లేదు.. అయినా పాలన భేషుగ్గా సాగుతోంది
- రాజ్యాంగ వ్యవస్థలు సహకరించడం లేదు.. అయినా సంచలనాత్మక నిర్ణయాలు జరుగుతున్నాయి
- రాజకీయ అనుభవం లేదు.. అయినా భారతదేశమంతా ఆంధ్రా వైపు చూసేలా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాడు

కాకలు తీరిన రాజకీయ యోధులు, అపర చాణుక్యులుగా చెప్పుకునే వాళ్ళు సైతం ఊహించని విధంగా జగన్ పరిపాలన అందరినీ ఆకట్టుకుంటుండడంతో రాష్ట్రంలో ప్రత్యర్థి పార్టీలను, ముఖ్యంగా ప్రతిపక్ష టీడీపీ అధినేతను కలవరపాటుకు గురిచేస్తోంది. తాజాగా ఇళ్ళ స్థలాల కేటాయింపు, గృహ నిర్మాణం వంటి అంశాలలో దేశంలోనే మొదటి స్థానాన్ని సంపాదించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా ప్రధానమంత్రి అభినందనలు అందుకోవడం ఒక్కటే కాకుండా, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానం, ఉత్తమ ముఖ్యమంత్రుల్లో 4వ స్థానం, మిగతా అన్ని రంగాల్లో మొదటి మూడు స్థానాల్లో జగన్ ఉండడంతో చంద్రబాబు, ప్రతిపక్షాలూ భరించలేకపోతున్నాయి. ఇప్పటికే జగన్ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికి, ఆయనని అప్రదిష్ట పాల్చేయడానికి తనకు తెలిసిన టక్కు, టమారా విద్యాలన్నింటినీ ప్రదర్శించేశాయి. జగన్ దేనికీ తొణకక, బెదరక పోవడంతో ఇక మిగిలిన అస్త్రాన్ని బయటకు తీశారు.

ఈ అంశంలో మిగిలిన ప్రతిపక్ష పార్టీలకంటే చంద్రబాబు ఒకడుగు ముందుకేశాడు. జగన్ క్రైస్తవుడు, రాష్ట్రంలో మత మార్పిళ్లను ప్రోత్సహిస్తున్నాడు, విగ్రహాలు కూల్చేస్తున్నాడు, హోంమంత్రి క్రిష్టియన్, డీజీపీ క్రిస్టియన్, సీఐడీ చీఫ్ క్రిస్టియన్, విజయనగరం ఎస్పీ క్రిస్టియన్ అంటూ పూర్తిగా దిగజారుడు రాజకీయాలకు దిగేశాడు బాబు. 14ఏళ్ళు ముఖ్యమంత్రి, మరో 14ఏళ్ళు ప్రతిపక్ష నేత అని చెప్పుకునే విజన్ లేని

(మిగతా 10వ పేజీలో)

## ఆంధ్రా పాలిటిక్స్‌లో బండి సంజయ్ ట్రిక్స్

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న సంఘటనలను తిరుపతి పార్లమెంటు ఉపఎన్నికలలో ఊతంగా వాడుకోవడానికి భారతీయ జనతాపార్టీ పావులు కదుపుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ తిరుపతి పార్లమెంటు ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ "భగవద్గీత పార్టీ కావాలా? బైబిల్ పార్టీ కావాలా?" తేల్చుకోండి అని కామెంట్ చేశాడు. అయితే దుబ్బాక ఉపఎన్నికలోనూ, గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ఇదే "మతం", "సర్జికల్ స్ట్రైక్" అనే పదాలు వాడి ఎన్నికలలో వేడిని పుట్టించాడు. బహుశా అదే తరహాలో తిరుపతిలో సైతం మత ప్రాధాన్యతపైన ప్రచారం చేసి ఓట్లు కొల్లగొట్టాలనే ప్రయత్నం చేస్తున్నట్లున్నాడు. తెలంగాణలో చేసిన పాలిటిక్స్, అక్కడ ఆచరించిన పొలిటికల్ ట్రిక్స్ ఆంధ్రాలో చెల్లవనే విషయం రాబోయే ఎన్నికల ఫలితమే బండి సంజయ్‌కి తెలియజేస్తుంది.





'నువ్వెళ్ళిపోయావు. ఇక నా పాటలు పాడేవాళ్ళెవరు?.. ఏ గంధర్వలోకానికో నువ్వేమో గానాన్ని మోసుకుపోయావు. ఇక్కడ నీలాగా నా పాటలు పాడేవాళ్ళెవరు?...నేనూ నీకాడికే వస్తున్నా. ఇద్దరం కలిసి పైలోకాలన్నీ తిరిగేద్దాం!.. గానం నీది.. గీతం నాది. నువ్వు పాడుతూ.. నేను రాస్తూ'...అంటూ పాటల మాటల రేడు.. మన 'వెన్నెలకంటి' కూడా వెళ్ళిపోయాడు. తన పాటలకు ప్రాణం పోసిన బాలు ఇక లేడనే బాధతో మనోవ్యధతో గత వందరోజులుగా ఆయనెంతో కుంగిపోయాడు. తనకు అమ్మ నాన్నా..గురువు దైవం..అన్నీ అయిన బాలు దగ్గరికి ఆత్రంగా వెళ్ళిపోయాడు. ఇంతకాలం తనను మెచ్చుకున్న 'పాట'క లోకానికి సెలవంటూ పెన్ను మూసేసి.. కన్నుమూశాడు. కొత్త సంవత్సరం వచ్చింది కదా అని ఆనందిస్తున్న వేళ.. జనవరి 5న ఆయన గుండెపోటుతో మరణించారనే సమాచారం అందరి హృదయాలనూ కలచివేసింది. సింహపురి సాహితీలోకం ఒక ఆణిముత్యాన్ని కోల్పోయినట్లయింది.

# పాటల మాటల రేడు..
# 'వెన్నెలకంటి'.. మనకిక లేడు!

తన అత్యద్భుతమైన మాటలు పాటలతో సినీప్రపంచాన్ని, అశేష ప్రేక్షక జనాన్ని మెప్పించి మురిపించి మైమరపించిన నెల్లూరు పాటల పిల్లోడు..మన వెన్నెలకంటి ఇక లేడనే మాట ఒక్కసారిగా నెల్లూరోళ్ళని నిశ్చేష్టుల్ని చేసింది. ఆయన మరణించారనే మాటను ఎవరూ నమ్మలేక పోయారు. అది పుకారైతే బాగుణ్ణు అనుకున్నారు. ఇప్పటికి కూడా ఎంతోమంది వెన్నెలకంటి మనకిక లేడని అనుకోలేకపోతున్నారు. అంతగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారాయన. జనవరి 5వ తేదీ సాయంత్రం 4.30గంటల సమయంలో తీవ్రమైన గుండెపోటుతో మద్రాసులోని తన ఇంటిలో ఆయన కుప్పకూలిపోయి తుదిశ్వాస విడిచారు.

నెల్లూరు కీర్తికిరీటాలుగా వెలుగొందిన గానగంధర్వుడు బాలు, పాటల రేడు వెన్నెలకంటి.. ఇద్దరూ వందరోజుల తేడాతో కనుమరుగవడం ఎంతో బాధాకరం. కానీ విధి.. మన చేతుల్లో లేదు కదా!...

ఎన్ని పాటలు రాశాడో!.. ఎన్ని డబ్బింగ్ సినిమాలకు మాటలు కూర్చాడో మన వెన్నెలకంటి. రంగులలోకమైన సినీపరిశ్రమలో రాణించేందుకు ఆయనెంతగా శ్రమపడ్డారో!.. ఎవరికి తెలుసు?.. పేరు వెన్నెలకంటే అయినా.. ఆయన జీవితం వెన్నెలబాటేమీ కాదు..సినీ కవిగా, మాటల రచయితగా నిలదొక్కుకోవడానికి మద్రాసు సినీ మాయాబజారులో ఎన్నెన్ని అవస్థలు పడ్డారో ఎంతమందికి తెలుసు?.. ప్రత్యక్ష దైవంలాంటి బాలు చేయూత దొరకడం ఆయన అదృష్టం మాత్రమే కాదు.. ఆయనకదో వరం. చెప్పాలంటే.. వెన్నెలకంటి పాటల జీవితానికదే ఒక పెద్ద మలుపు. వెన్నెలకంటి విషయంలో.. అసలైన వెన్నెల కురియడం అప్పుడే ప్రారంభమైంది. వెండితెరపై గీత రచయితగా 'వెన్నెలకంటి' పేరు మెరిసి.. సినీరంగమంతా నెల్లూరు పేరు మార్మోగింది.

## జీవితమంతా పాటల వెన్నెలే :

ఆయన జీవితం కవిత్వంతో ఆరంభమై..పాటలుగా పరిమళించి.. మాటలుగా వికసించి సాహితీవనానికే కొత్త వసంతాలు తెచ్చింది. తీయని తెలుగు పాటకు సరికొత్త సుగంధాల గుభాళింపులు తెచ్చింది. జీవితమంతా పాటల వెన్నెలే అయింది. ఆయన రాసిన రెండువేలా అయిదువందలకు పైగా పాటల్లో సగానికి పైగానే పాడింది.. గానగంధర్వుడు మన బాలూయే కావడం ఎంత అదృష్టం. 'గీతం వెన్నెలకంటి..గానం బాలు'గా అవి అశేష ప్రజలను అలరించడం ఎంతటి భాగ్యం!.. వారి గానం.. వీరి గీతం ఒక్క సింహపురి సీమకే కాదు.. మొత్తంగా తెలుగుజాతికీ.. సాహితీలోకానికే గర్వకారణం.

'చిరునవ్వుల వరమిస్తావా..చితి నుంచి బతికొస్తాను!..మరుజన్మకు కరుణిస్తావా..ఈ క్షణమే మరణిస్తాను'...అంటూ హృదయాన్ని కదిలించే విధంగా పాటలు రాయడమంటే మాటలు కాదు. 'చిన్ని చిన్ని కన్నయ్యకు వెన్నెల జోల'..వంటి హృద్యమైన పాటల్ని రాసి..కొల్లలుగా రాశి పోసి అందరి అభినందనలు అందుకున్నారాయన. 'హృదయం ఎక్కడున్నదీ'.. అంటూ ప్రేమగీతాలకు అసలు కొదవే లేదు. 'మాటరాని మౌనమిది.. మౌనవీణ గానమిది'..వంటి పాటలైతే ఆయన ప్రతిభా 'పాట'వాలకు పతాకాలుగా చిరస్థాయిగా నిలిచిపోతాయి. అది పాటైనా మాటైనా.. పదమైనా పద్యమైనా..కవితైనా నాటకమైనా ఏదైనా సరే..ఏది రాసినా తనదంటూ ఒక ప్రత్యేకమైన శైలిలో..విశిష్టమైన బాణీలో రాసిన ఆయన పాటలు మధురాలు.. మధురాతి మధురాలు! అలా దాదాపు మూడు వందలకు పైగానే సినిమాల్లో.. దాదాపు రెండున్నర వేలకుపైగానే పాటలు రాసి.. పదికాలాల పాటు హాయిగా పాడుకునేలా చేసి.. అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు.

## బ్యాంకు ఉద్యోగం వదిలేసి.. పాటల ప్రపంచానికి

వెన్నెలకంటి అనే ఇంటిపేరుతో సినీకవిగా ప్రఖ్యాతిచెందిన వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్ పుట్టినూరు నెల్లూరని అందరికీ తెలిసిందే. 1957 నవంబరు 30న ఆయన నెల్లూరులో పుట్టాడు. వెన్నెలకంటి కోటేశ్వరరావు–పద్మావతమ్మల ప్రియపుత్రునిగా పుట్టి, చిన్నతనం నుంచే పద్యాలు రాయడం ప్రారంభించాడు. విద్యారంగంలోనూ బాగా రాణించాడు. విఆర్‌కాలేజీలో బికాం డిగ్రీ పూర్తిచేసి చిత్తూరుజిల్లా చంద్రగిరిలో ఎస్‌బిఐలో ఉద్యోగంలో చేరాడు. స్వతహాగా సహృదయుడు. స్నేహపాత్రుడు. తనకన్నా ఎంతో చిన్నవారినైనా సరే ఎంతో ఆత్మీయంగా పలకరించే నైజం ఆయనది.

పద్యాలు పాటలన్నా, కవిత్వమన్నా ఆయనకు ప్రాణం. అత్యద్భుతమైన రీతిలో ఆయన రచించిన 'ఆత్మవత్ సర్వభూతాని', 'యత్ర నార్యస్తు పూజ్యంతే' నాటికలు నాటక పరిషత్తుల్లో బహుమతులు కొల్లలుగా పట్టుకొచ్చాయి. కవిత్వం మీద ప్రేమతో యువకప్రాయంలోనే 'ఉషోదయం ఆపలేవు' వంటి కవితా సంపుటాలు రాసి తన కవితా గురువైన డా.నాగభైరవకు చూపించి ఆయన గురుత్వంలో కవిత్వంలో ఎదిగి గురువుకు తగ్గ ప్రియశిష్యుడనిపించుకున్నాడు. సినిమాల్లో పాటలు రాయాలని బంగారం లాంటి బ్యాంకు ఉద్యోగాన్ని వదులుకొని మద్రాసు రైలెక్కాడు. పదకొండేళ్ళ వయసులోనే పద్యాలపై పట్టు సాధించి లలితా శతకం, 'రామచంద్ర శతకం' రాసిన వెన్నెలకంటిని.. ఆ రామచంద్రుడే కరుణించి సినిమాల్లో పాటలు–మాటలు రాసే వరమిచ్చాడు. 1986లో 'శ్రీరామచంద్రుడు' అనే సినిమాకే ఆయన తొలిపాట రాశాడు. 'చిన్ని చిన్ని కన్నయ్యకు వెన్నెల జోల'అనే పాట వెన్నెలకంటికి ఎంతో పేరు తెచ్చింది కూడా. అప్పటినుంచి రెండున్నర వేలకు పైగానే పాటలు రాశారు. అన్ని పాటల్లోనూ 'వెన్నెలకంటి' భావుకత, గీతరచనా శైలీ విన్యాసం శ్రోతల్ని ముగ్ధుల్ని చేశాయి.

## నెల్లూరంటే ఎంతో అభిమానం :

తాను చెన్నైలో ఉన్నా సరే.. ఎప్పుడు నెల్లూరోళ్ళు ఏ సాహితీ సభకో..సమావేశాలకో పిలిస్తే చాలు..వెంటనే ఎన్ని పనులున్నా సర్దుబాటు చేసుకుని నెల్లూరుకు వచ్చేసేవాడు. ఒకవేళ ఎప్పుడైనా రాలేని పరిస్థితి ఉంటే..ఎంత బాధపడేవాడో చెప్పలేం. నెల్లూరంటే ఆయనకు పిచ్చి అభిమానం. నెల్లూరులోని సాహితీసభలంటే చెప్పలేనంత ఇష్టం. ఆయన కవిత్వాన్ని ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించేవాడు. ఎన్నో అవార్డులందుకున్నాడు. తనచేత్తో ఎందరికో అవార్డులిచ్చాడు. వర్ధమాన కవుల 'పెన్ను తట్టి' ప్రోత్సహించాడు. నెల్లూరుకు వెన్నెలకంటి వస్తే చాలు..ఆయన అభిమానులు మిత్రులందరికీ కూడా ఎంతో సంతోషం! ఆ మాటలు పాటలు ఆయన నోటిగుండా వినాలని ఉబలాటపడేవారు. జోకుల కేకులు కట్ చేసుకుని అందరూ ఆనందించేవారు. ఆ స్నేహితుల సంతోషాలు.. సరదాలు అందరినీ పులకింపజేసేవి.

అవన్నీ ఇప్పుడు ఎవరితో పంచుకోగలం?..

ఇంత ఆత్మీయతను ఇంకెవరితో పెంచుకోగలం?..

నెల్లూరులో వెన్నెలకంటి అప్పట్లో పెట్టిన 'చేతన' సంస్థ ఆయన తొలినాళ్ళ భావావేశాలకు ప్రతీకగా ఉండేది. ఆ తర్వాత మద్రాసులో పెట్టిన 'వేదిక' ఆయన సాహితీ పరిణితికి నిలువుటద్దంగా ఉండేది. ఒకటా రెండా..ఎన్ని సాహిత్య కార్యక్రమాలో చెప్పలేం. వాటి నిర్వహణలో వెన్నెలకంటి పడే తపన..ఆనందం అంతా ఇంతా కాదు.

ఇప్పుడవన్నీ ఎవరు నిర్వహిస్తారు?..ఇంత ప్రేమగా ఇంకెవరు చేస్తారు?...

'ఉషోదయం ఆపలేవు'..అంటూ వెన్నెలకంటి యువకప్రాయంలో రాసిన కవితాసంపుటిని డా. నాగభైరవ ఒక ఇంద్రధనుస్సుతో పోల్చారు. ఏడురంగులతో కలసి ఏకవర్ణంతో మెరిసే ఇంద్రధనుస్సులాగా ఉందంటూ అభినందించారు కూడా. అప్పుడే కాదు.. ఆ తర్వాత కాలంలో కూడా వెన్నెలకంటి పాటలు వెన్నెల జలపాతాలుగా జాలువారి అందరినీ అలరించాయి. ఎన్నో పాటలు అందరి మనసుల్లో హరివిల్లులై మెరిశాయి.

కానీ..కాలానికివేమీ పట్టవు. ఈ పాటలు గీటలంటే దానికసలే గిట్టవేమో!... అందుకే వినీ విననట్లు మెల్లిగా కదిలిపోయింది. వెన్నెల కరిగిపోయింది. చీకటి మాత్రం మిగిలిపోయింది. అయినా ఎక్కడో ఏదో పాట వినబడుతూనే ఉంది. అది వెన్నెలకంటి పాటగా తెలుస్తూనే ఉంది. ఆయన కనబడకున్నా..వినబడుతున్న ఆ పాటల్లో ఆయన ఎప్పటికీ చిరంజీవే!...

## వెన్నెలకంటి మృతి బాధాకరం

**- సిఎం వైఎస్ జగన్**

ప్రముఖ సినీ రచయిత వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ అకాల మరణం ఎంతో బాధాకరమని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తన సంతాపం తెలియజేశారు. వెన్నెలకంటి ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొంటూ, వెన్నెలకంటి కుటుంబసభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.



## 'తుంగా' అవార్డుకు
## 'రాజ'సం ఉందన్న వెన్నెలకంటి


నెల్లూరు నుంచి మద్రాసుకు వెళ్ళి సినీరంగానికి ఉత్తమ గీతాలు అందిస్తున్న ప్రముఖ సినీకవి, మన నెల్లూరీయుడైన వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్‌కు 'లాయర్' రజతోత్సవం సందర్భంగా 2006, జూన్3న 'లాయర్' వారపత్రిక తుంగా అవార్డు(సాహితీ పురస్కారం)ను అందజేసింది. ఈ అవార్డును అప్పటి ముఖ్యమంత్రి, మహానేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా వెన్నెలకంటి అందుకున్నారు. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాల్‌రెడ్డి స్మారకంగా ఇచ్చే ఈ అవార్డును స్వీక రించిన తర్వాత వెన్నెలకంటి మాట్లాడుతూ 'ఈ అవార్డుకు 'రాజ'సం ఉందని, తాను అందుకున్నది 'రాజ'గోపాలరెడ్డి అవార్డు అయితే, ఈ అవార్డును అందజేసింది ముఖ్యమంత్రి 'రాజ'శేఖరరెడ్డి అని, స్వీకరిం చింది వెన్నెలకంటి 'రాజే'శ్వరప్రసాద్ కనుక, ఈ మూడు పేర్లలో 'రాజ' అనేది కలసి ఉండడంతో వెన్నెలకంటి ఆ మాటని ఎంతో భావగర్భితంగా 'రాజసం అని చెప్పి, తుంగా అవార్డుకు 'రాజసం' ఉందంటూ అందరి హర్షధ్వానాలందుకున్నారు.

ఏదేమైనా 'లాయర్' కుటుంబానికి 2006లో జరిగిన ఆ రజతోత్సవ సభ ఒక మరపురాని, మరువలేని జ్ఞాపకం. తొలి నుంచి 'లాయర్' కుటుంబానికి వెన్నెలకంటి ఎంతో ఆత్మీయునిగా ఉండేవారు. ఎప్పుడు నెల్లూరొచ్చినా 'లాయర్' కార్యాలయానికి వచ్చి అందరినీ పలకరించి తన పాటల మాటలన్నీ చెప్పేవాడు. ఆయన నిగర్వి. ఎన్ని పాటలు రాసినా, తానెంత గొప్పకవి అయినా.. తానో మహాకవిని అన్నట్లుగా ఎప్పుడూ గొప్పలు పోయింది లేదు. 'లాయర్' వారపత్రికపైన ఇటీవల ఒక గీతాన్ని కూడా ఆయన రచించారు. ఆయన రచించిన గీతాన్ని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారిచే పాడించి 'లాయర్' 40వ వార్షికోత్సవంలో ఆవిష్కరించాలనుకుంటున్న తరుణంలో వందరోజుల తేడాతో ఆ గురుశిష్యులిద్దరూ దివంగతులు కావడం బాధాకరం. మంచి కవి, ఆత్మీయుడు వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ లేని లోటు ఏనాటికీ తీరనిది. ఆయన మృతికి విచారం ప్రకటిస్తూ.. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతోంది 'లాయర్'!...

## సాహితీలోకమే మూగబోయింది

డా.నాగభైరవ అవార్డు కమిటీ అధ్యక్షునిగా వెన్నెలకంటి, నేను కార్యదర్శిగా పని చేశాము. ఎంతో ప్రేమార్ద్ర హృదయులు, మరెంతో శ్రద్ధతో ఆ అవార్డును ప్రసిద్ధిలోకి తీసుకుని రావడంలో వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ పాత్ర అమోఘం.. అనితరసాధ్యం. శోకతప్త హృదయంతో ఆ మనసున్న మంచికవికి..నా నివాళి. **- చిన్ని నారాయణరావు,** ప్రధాన కార్యదర్శి, **డా.నాగభైరవ అవార్డు కమిటీ, నెల్లూరు.**

## కళ్యాణ వైభవం...!




కేంద్ర మాజీమంత్రి శ్రీమతి పనబాక లక్ష్మి, రైల్వేశాఖలో ముఖ్యపౌరసంబంధాల అధికారిగా పదవీ విరమణ చేసిన పనబాక కృష్ణయ్య దంపతుల రెండవ కుమార్తె, ప్రస్తుతం ఏలూరు డిప్యూటి కలెక్టర్‌గా పనిచేస్తున్న కుమారి రచన - భార్గవశేఖర్ (ఇన్‌కమ్ టాక్స్ అధికారి)ల పరిణయం జనవరి 6వ తేదీ బుధవారం హైదరాబాద్ మహింద్ర హిల్స్‌లోని పనబాక దంపతుల నివాసంలో జరిగింది. మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర మాజీమంత్రి కుమారి శెల్జ, పల్లంరాజు, శ్రీమతి గీతారెడ్డి, మధుయాష్కీలతో పాటు తదితర రాజకీయ, రాజకీయేతర నాయకులు, అధికార, అనధికార ప్రముఖులు పరిమిత సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొని కొత్త దంపతులను దీవించారు. నవ వధూవరులకు 'లాయర్' అభినందన ఆశీస్సులు.

# జనవరి 11న జిల్లాకు ముఖ్యమంత్రి

## నెల్లూరు నుండే రెండవ విడత 'అమ్మఒడి'



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 11వ తేదీ నెల్లూరొస్తున్నారు. ముందుగా ప్రకటించిన ప్రకారం ఆయన 9వ తేదీ జిల్లాకు రావాల్సి ఉండగా, ఆ పర్యటన జనవరి11 సోమవారానికి మారింది. సోమవారం ఉదయం రేణిగుంట ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానం ద్వారా చేరుకోనున్న ముఖ్యమంత్రి అక్కడ నుండి సుమారు 11గంటల ప్రాంతంలో హెలికాప్టర్ ద్వారా నెల్లూరు రానున్నారు. నెల్లూరు జాతీయ రహదారిలోని వేణుగోపాలస్వామి కాలేజ్ ప్రాంగణంలో జరగనున్న భారీ సభలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. రెండవ విడత 'అమ్మఒడి' మొత్తాన్ని అమ్మానాన్నల ఖాతాల్లో ఇక్కడనుండే జమ చేయనున్నారు. సుమారు 7వేల కోట్ల రూపాయలను ఈ సందర్భంగా ఆయన ప్రజల ఖాతాలలో జమ చేస్తారు.

గత యేడాది కూడా సరిగ్గా సంక్రాంతి పండుగకు ముందే 'అమ్మఒడి' డబ్బులు అకౌంట్లలో వచ్చి పడడంతో రాష్ట్రవ్యాప్తంగా పల్లెలన్నీ పండుగ శోభతో కళకళలాడాయి. ఈసారి కూడా సరిగ్గా పండుగకు రెండురోజుల ముందు 'అమ్మఒడి' ద్వారా డబ్బులు జనానికి చేరనున్నాయి. కార్యక్రమం ముగించుకున్న అనంతరం సుమారు ఒంటిగంట ప్రాంతంలో ముఖ్యమంత్రి రేణిగుంటకు తిరుగు ప్రయాణమై అక్కడనుండి తాడేపల్లికి వెళ్లనున్నారని అనధికారికంగా అందిన సమాచారం. ముఖ్యమంత్రి నెల్లూరు రానున్న సందర్భంగా సభా కార్యక్రమ ఏర్పాట్లను జిల్లా మంత్రులు అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డిలతో పాటు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ భాస్కర్‌భూషణ్, ముఖ్యమంత్రి కార్యక్రమాల అధికారిక సమన్వయకర్త తలసిల రఘురాం తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

# ఓటు నమోదు.. నిరంతర ప్రక్రియ

### - రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి విజయానంద్

ఓటు నమోదు అనేది ఒక నిరంతర ప్రక్రియ అని, ప్రతి ఆరునెలలకోసారి ప్రత్యేక నమోదు ప్రక్రియ జరుగుతుందని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి విజయానంద్ అన్నారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని జడ్పీ హాల్‌లో ఈఆర్‌ఓలు, ఏఇఆర్‌ఓలు, ఇఎస్‌ఏలతో సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో 18 ఏళ్ళు దాటిన యువతలో ఓటునమోదు పట్ల చైతన్యం బాగా పెరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అర్హులైనవారందరికీ ఓటు హక్కు కలిగించి, తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ నెల 15న తుది ఓటర్ల జాబితా ప్రకటించాల్సి ఉందని, త్వరిత గతిన ఆ ప్రక్రియను పూర్తిచేయాలని చెప్పారు. గతంలో ఇంటి అడ్రసులు, పేర్లు తప్పులు ఉంటే వాటిని సరిదిద్దిన తర్వాత వారికి కొత్త ఎపిక్ కార్డులు ఇవ్వాలని తెలిపారు.

### 28వేల మంది దాకా కొత్త ఓటర్లు :

జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఓటు నమోదుకు 35వేలకు పైగానే దరఖాస్తులు వచ్చాయని, సుమారు 28వేల మందిదాకా కొత్తగా ఓటర్లు నమోదయ్యారని




తెలిపారు. బిఎల్‌ఓల వద్ద ఓటర్ల జాబితాలుంటాయని, ప్రజలందరూ తమ ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు 'మై ఓట్' అనే యాప్ ద్వారా పరిశీలించుకోవచ్చని, ఒకవేళ ఓటు లేకపోతే ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2021 జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్లు నిండిన వాళ్ళంతా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ హరేంద్రి ప్రసాద్, డిఆర్‌ఓ నాగేశ్వరరావు, గూడూరు సబ్‌కలెక్టర్ గోపాల కృష్ణ, మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్, జడ్పీ సిఇఓ సుశీల, ఆర్డీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.




# ఆంధ్రప్రదేశ్‌కు 344 కోట్ల రివార్డు

## పౌర సేవల సంస్కరణల అమలులో ఏపి కృషికి కేంద్రం ప్రోత్సాహం

దేశంలో పౌర సేవల సంస్కరణల అమలులో ఆంధ్రప్రదేశ్ తీసుకుంటున్న శ్రద్ధ, చొరవ అందరి ప్రశంసలను అందుకుంటోంది. ప్రత్యేకించి కేంద్రప్రభుత్వం కూడా ఈ సంస్కరణల అమలుకు రాష్ట్రాలకు ప్రోత్సాహంగా ఇచ్చే కోట్లాదిరూపాయల రివార్డును కూడా ఆంధ్రప్రదేశ్ అందుకొంది. దేశంలో పౌర సేవల సంస్కరణల అమలుకు కేంద్రప్రభుత్వం నిర్దేశించిన మూడు లక్ష్యాలను అమలుచేసి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ 344 కోట్ల రివార్డును సాధించడం ఎంతైనా విశేషం. 'వన్ నేషన్-వన్ రేషన్‌కార్డ్' సంస్కరణతో పాటు సులభతరమైన వాణిజ్య సంస్కరణలు, పట్టణ స్థానిక సంస్థల సంస్కరణలను పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వం ఈ అరుదైన రివార్డును సాధించింది. దీంతో ప్రాజెక్టుల మూలధన వ్యయం కోసం ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా 344 కోట్లు లభించాయి. ఇదేవిధంగా లక్ష్యాలు సాధించిన మధ్యప్రదేశ్‌కు కూడా 660 కోట్ల రివార్డు లభించింది. ఆత్మనిర్భర్ భారత్ ప్యాకేజీలో భాగగా ఈ ప్రత్యేకమైన పథకాన్ని 2020 అక్టోబర్ 12న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. కోవిడ్-19 సంక్షోభం వల్ల పన్ను ఆదాయానికి కొరత ఏర్పడడంతో రాష్ట్ర ప్రభుత్వాలకు మూలధన వ్యయాన్ని పెంచేందుకు ఈ ప్రత్యేక పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ఇప్పటిదాకా 27 రాష్ట్రాల్లో 9880 కోట్ల మూలధన వ్యయం ప్రతిపాదనలకు ఆర్థికశాఖ అమోదం తెలపడం, 4940 కోట్లు విడుదల కావడం కూడా జరిగింది.

# జనవరి 10న వెన్నెలకంటి సంతాపసభ



ప్రముఖ సినీకవి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ సంతాపసభ జనవరి 10వ తేది ఆదివారం ఉదయం 10 గంటలకు నెల్లూరులోని హోటల్ అతిథి గ్రాండ్‌లో జరుగుతుందని డా. నాగభైరవ అవార్డు కమిటీ కార్యదర్శి చిన్ని నారాయణరావు, కళాంజలి అనంత్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వెన్నెలకంటి అభిమానులు, సాహితీవేత్తలు, కళాకారులు అందరూ తరలివచ్చి వెన్నెలకంటికి నివాళులర్పించవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు. నాగభైరవ అవార్డు కమిటీ అధ్యక్ష స్థానంలో వెన్నెలకంటి అనేక సభలలో కీలకపాత్ర పోషించారని, వెన్నెలకంటి ఆకస్మిక నిష్క్రమణం నాగభైరవ అవార్డు కమిటీకి పూడ్చలేని లోటని నాగభైరవ అవార్డు కమిటి నిర్వాహకులు తమ ఆవేదన వెలిబుచ్చారు.



## ‘ప్రభా’తం

# పడకేసిన.. పురపాలన

**దేశంలో కొన్ని వ్యవస్థల్లో కొంత మేలైన విధానాలున్నా సరైన దిశా నిర్ధేశం లేక అనేక రాష్ట్రాల్లో పురపాలక సంస్థల వంటి కీలకవ్యవస్థలు రానురాను నీరసపడిపోతున్నాయి. దీంతో పట్టణాల పురోగతి కూడా కుంటుపడుతోంది. పురపాలక సంస్థలకు స్వయంప్రతిపత్తి లేకపోవడం, నిధులు కరువవడంతో అనేక రాష్ట్రాల్లో పురపాలన అస్తుబిస్తుగానే ఉంటోంది. పట్టణాల ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. ఇకనైనా ఈ పరిస్థితి మారాలి. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఆలోచించి పురపాలక సంస్థలను మరింత పరిపుష్టంగా, పటిష్టంగా తీర్చిదిద్దాలి.**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడిచిపోతున్నా మనదేశంలోని కొన్ని ప్రజోపయోగకరమైన..కీలకమైన వ్యవస్థల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. ఫలితంగా దేశంలో ప్రజల సమస్యలు తీరకపోగా కొల్లలుగా పెరిగిపోతూనే ఉన్నాయి. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాల అమలుతో గతంలో కంటే దేశంలో ఇటీవలికాలంలో కొంత మెరుగైన అభివృద్ధి కనిపిస్తున్నా, జరగాల్సిన అభివృద్ధి ఇంకా ఎంతో ఉంది. అందుకు అన్ని వ్యవస్థలను పటిష్టవంతం చేయాల్సి ఉంది. సరైన దిశానిర్ధేశం లేక.. కొన్ని వ్యవస్థల్లో కొంత మేలైన విధానాలున్నా రాష్ట్రాల్లో అవి ఆశించిన స్థాయిలో అమలులోకి రావడం లేదు. అందుకు మన పురపాలక వ్యవస్థే ఒక ఉదాహరణ. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందజేసేందుకు, పట్టణాల పురోగతికి పురపాలక సంస్థలు ఉన్నప్పటికీ అవి నేటికీ అనేకరకాల సమస్యల సుడిగుండంలో పడి కొట్టుమిట్టాడుతూనే ఉన్నాయి. వాటికి సరైన విధులు కానీ, నిధులు కానీ, విధానాలు కానీ లేకపోవడంతో అనేక రాష్ట్రాల్లో పురపాలన రానురాను అరకొరగానే సాగుతుండడం విచారకరం.

దేశంలోని పలు పట్టణాల్లో ఇటీవల ఒక స్వచ్ఛంధ సంస్థ సర్వే నిర్వహిస్తే, అనేక రాష్ట్రాలు పురపాలక అభివృద్ధిలో అడుగంటిపోతున్నాయని తేలింది. పురపాలక సంస్థలకు స్వయంప్రతిపత్తి ఉండాలని రాజ్యాంగం సూచిస్తున్నా, పట్టణాల అభివృద్ధి కోసం పలు విధులను నిర్ధేశించినా ఆచరణలో నేటికీ వాటిని రాష్ట్రాలు సక్రమంగా అమలుచేయడం లేదని స్పష్టం చేసింది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో పురపాలక సంస్థల మీద రాష్ట్రాలే అధికారం చలాయిస్తుండడం, పట్టణాల అభివృద్ధికి తమవంతుగా ఆర్థిక చేయూత నివ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు మొండిచేయి చూపిస్తుండడంతో పురపాలకసంస్థల పాలనతో పాటు పట్టణాల ప్రగతి కూడా ఎంతోకాలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉంటోంది. పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు గానీ, పట్టణాల పరిశుభ్రతకు గానీ, ప్రగతికి గానీ దేనికైనా సరే ముందుగా కావాల్సింది నిధులే. కానీ రాష్ట్రప్రభుత్వాలు కరుణించకపోవడంతో నిధులు లేక దేశంలోని అనేక పురపాలక సంస్థలు నీరుగారిపోతున్నాయి. నిద్రమంచం లేచిందగ్గరనుంచి ప్రజలకు నీటి సరఫరా తప్పనిసరి. అదేవిధంగా పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడం, ఎప్పటికప్పుడు చెత్తకుప్పలు, మురుగుదిబ్బలను ప్రక్షాళన చేస్తుండడం, ముఖ్యంగా డ్రైనేజీలు, సైడుకాలువలను పరిశుభ్రం చేస్తుండడం, మురుగునీటి పారుదలకు దారులు తీయడం వంటి పనులు అనేకం ఉంటాయి. ఏ పని సక్రమంగా లేకపోయినా దాని తాలూకు దుష్పరిణామాలు, రోగాలు ప్రజలకు తప్పవు. పట్టణాల్లో ఇవి సర్వసాధారణ సమస్యలుగా ఉంటున్నాయే తప్ప వీటికి శాశ్వతమైన పరిష్కారం ఉండడం లేదు. కొన్ని పురపాలక సంస్థల్లో సిబ్బందికి అవసరమైన జీతభత్యాలకే కాక, పట్టణాల్లో ఏ అభివృద్ధి పనిచేపట్టాలన్నా నిధుల కొరతే వెక్కిరిస్తోంది. నిధులు లేకపోతే విధులు ఎలా నిర్వర్తించాలి?.. ప్రగతి రథాన్ని ఎలా ముందుకు కదిలించాలి?... పట్టణాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో దేశంలోని అనేక రాష్ట్రాలు నిర్లిప్తంగా ఉంటున్నాయని, ఏమాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదని, దీంతో క్రమేణా పురపాలక సంస్థలు స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయి నిర్వీర్యమవుతున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలని, పర్యావరణం కాపాడుకోవాలని, చెత్తను ఎప్పటికప్పుడు ఏరివేస్తుండాలని రాష్ట్రాలు ప్రకటించుకోవడమే తప్ప వాటిని అమలులోకి తేవడానికి అవసరమైన ఆర్థిక వనరులు పురపాలక సంస్థలకు సమకూర్చాలనే బాధ్యతను మాత్రం విస్మరిస్తున్నాయనే అభిప్రాయాలు సర్వత్రా వెల్లడవుతున్నాయి. పట్టణప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజల అవసరాలను తీర్చే సామర్థ్యం లేకపోవడంతో అనేక రాష్ట్రాల్లో పురపాలన మొక్కు బడిగా సాగుతోందని, చివరికి ప్రజల నుంచి వచ్చే విన్నపాలను కూడా పట్టించుకోలేని దుస్థితి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించలేని దయనీయస్థితి అనేక పురపాలక సంస్థల్లో ఉందని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులున్నా వారికి కూడా పరిమితమైన అధికారాలే తప్ప ప్రజల సమస్యలను తీర్చేంతటి స్థాయిలో అధికారాలు లేకపోవడం, అధికారులకు కొంతమేరకు అధికారాలున్నప్పటికీ పురపాలక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాలు చాలినంతగా నిధులు విదల్చకపోతుండడంతో పట్టణప్రాంతాల్లో సమస్యలు కొల్లలుగా పెరిగిపోతూనే ఉన్నాయి. అయితే ఈ దుస్థితి ఒక్క పట్టణాల్లోనే కాదు, నగర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల వ్యవస్థల్లో కూడా ఉంది. నిధులు లేక విధులు లేక అనునిత్యం ప్రజలకు అవసరమైన ఇలాంటి కీలక వ్యవస్థలు నీరసపడిపోతే ఎలా?... ఇకనైనా ఈ పరిస్థితి మారాలి. లోపాలను సరిదిద్దుకుని అభివృద్ధిలో అడుగులు ముందుకు వేయాలి. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేధావులు, నిపుణులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు అందరూ కలిసి పట్టణాల ప్రగతిపై దృష్టి సారించి, అందుకు దోహదం చేసే పురపాలక సంస్థల పురోగతికి ఏం చేయాలో బాగా ఆలోచించి తగు నిర్ణయాలు తీసుకోవాలి. ముఖ్యంగా వాటికి స్వయంప్రతిపత్తి కల్పించడంతో పాటు పుష్కలంగా నిధులిచ్చి తద్వారా పట్టణాల్లో అభివృద్ధిని వేగవంతం చేయాలి. అంతేకాదు, పురపాలనకు అవసరమైన నిర్ణయాలను తీసుకునే స్వేచ్ఛ, అధికారం కూడా ఆ వ్యవస్థలకు కట్టబెట్టి ఎక్కడికక్కడ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి పట్టణ ప్రజలకు మెరుగైన పాలన అందించే విధంగా అన్ని విధాలా గట్టి చర్యలు తీసుకోవాలి. అందుకు పురపాలక సంస్థలను మరింత పరిపుష్టంగా, మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలి. అప్పుడే మనదేశంలో పట్టణప్రాంతాలు అన్ని అవరోధాలను అధిగమించి ప్రగతిదారుల్లో పురోగమిస్తాయి.

# తిరుపతిలో బీజేపీకి తిరుక్షవరమే!

తిరుపతి లోకసభ స్థానానికి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో ఇంకా తెలియకపోయినప్పటికీ బీజేపీ హడావుడి మాత్రం మొదలైపోయింది.

ఉప ఎన్నిక జరిగేంత వరకూ తిరుపతిలోనే నివాసం ఉంటానని బీజేపీ ఆంధ్ర పరిశీలకుడు దియోధర్ ప్రకటించారు. అడ్వాన్స్‌గా తలనీలాలు కూడా స్వామివారికి సమర్పించారు. గత 17, 18 నెలలుగా రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ వచ్చిన ఎం.పి జీవీఎల్ నరసింహారావు తిరుపతి వచ్చి వైసీపీని తీవ్రంగా విమర్శిస్తూ– నాలుకకు నరం ఉండదనే సూక్తిని నిజం చేసి చూపించారు. బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు అయితే.. తిరుపతిలో తన ‘తడాఖా’ చూపించడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఆయన అధ్యక్షుడయ్యాక వస్తున్న తొలి ఎన్నిక ఇదే కావడంతో, బీజేపీ పరువు నిలబెట్టాలనే పట్టుదలలో ఉన్నారు. తిరుపతి – పుణ్యక్షేత్రం కావడంతో, హిందూత్వ భావాలకు కేంద్రంగా ఉన్నదనే అభిప్రాయం బీజేపీకి ఉండడం వల్ల కూడా అక్కడ ఆ పార్టీ నేతల ‘ట్రాఫిక్’ ఇటీవల బాగా పెరిగింది.






దీనికి తోడు, పవన్ కళ్యాణ్ జనాకర్షణ శక్తిపై గట్టి నమ్మకాలు పెట్టుకున్నట్టు కనపడుతోంది.

ఇది వైసీపీ స్థానం. ఆ పార్టీ నుంచి బల్లి దుర్గాప్రసాద్ గతంలో గెలిచారు. ఆయన అకాల మరణంతో ఇప్పుడు ఉప ఎన్నిక నిర్వహించాల్సి వస్తున్నది.

ఆ ఉప ఎన్నికకు షెడ్యూల్ ఇంకా రాలేదు. ఆ షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా– ఆ స్థానం వైసీపీదే అన్నది జగద్విదితం. తెలియాల్సిందల్లా– ఎన్నికల షెడ్యూల్, అధికారికంగా వైసీపీ అభ్యర్థి పేరు మాత్రమే. తెలుగుదేశం పార్టీ కూడా అభ్యర్థిని ప్రకటించేసింది. గత సార్వత్రిక ఎన్నికల తరువాత– వైసీపీని ఢీ కొనడానికి లభించిన తొలి అవకాశం– తిరుపతి ఉప ఎన్నిక కావడంతో టీడీపీ కూడా బలప్రదర్శనకు సిద్ధమవుతోంది.

అయితే, వైసీపీ ఆధిక్యతను ఎంత మేరకు తగ్గించగలదు అనేదే టీడీపీపై పరిశీలకులకు ఉన్న అనుమానాలు.

మరి ఈ రెండింటి పోరు మధ్య బీజేపీ స్థానం ఎక్కడా అంటే.... ‘ఏం చెబుతాం...?’

‘బైబిల్ పార్టీ కావాలా... భగవద్గీత పార్టీ కావాలా?’ అంటూ పక్క రాష్ట్రమైన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పత్రికలకు ఎక్కారు అంటే– ఆంధ్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజుపై బీజేపీ కేంద్ర నాయకత్వానికి నమ్మకం కుదరడం లేదా అనిపిస్తున్నది.

దీనికితోడు – పవన్ కళ్యాణ్ తలనొప్పి ఒకటి. వాళ్లకు కోపాలు రావడాలు... వీళ్ళు బుజ్జగించడాలు. వీటికితోడు, బీజేపీ ప్రకటనలు, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, ప్రధాన పార్టీలకు హెచ్చరికలు మొదలైన వాటివల్ల– ఓటర్‌లకు, మీడియా పాఠకులు... వీక్షకులకు బోలెడంత వినోదం.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. గంటయ్య (రమణారెడ్డి) పాత్ర లేకుండా... గుండమ్మ కథ అంత హిట్ అయ్యేదేనా? అందుకే, తిరుపతి ఎం.పి. సీటు బై ఎలక్షన్‌లో బీజేపీ పోటీ చేయాలి.

**– భోగాది వేంకటరాయుడు**

# ఆదర్శమూర్తి రతన్ టాటా




భారతీయ వ్యాపార దిగ్గజం రతన్ టాటా మరోసారి తన నిరాడంబరతను, మానవీయతను చాటుకున్నాడు. రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న తమ సంస్థ ఉద్యోగిని పరామర్శించడానికి అయన ముంబై నుండి పూణేకి కారులో వెళ్ళాడు. 83 సంవత్సరాల వయస్సులో తన ఉద్యోగి పట్ల ఆయనకున్న ప్రేమాభిమానాలను చూసిన నెటిజన్లు రతన్ టాటాపై అభినందనల వర్షాన్ని కురిపిస్తున్నారు. రతన్ టాటా పుణెలోని ఫ్రెండ్స్ సోసైటీలో నివసిస్తున్న తన సంస్థ ఉద్యోగిని పరామర్శించడానికి వెళ్ళినప్పుడు అక్కడ మీడియా హడావుడిలేదు, ఆయన వెంట బౌన్సర్లు లేరు, వ్యక్తగత రక్షకులు లేరు, తాను ఒక్కడే అక్కడికి వెళ్లాడని ఆయనను గమనించిన యోగేష్ దేశాయ్ అనే వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో ఆ దృశ్యాన్ని బందించి నెట్టింట పెట్టాడు. పుణెలోని ఫ్రెండ్స్ సొసైటీలో నివసిస్తున్న తన మిత్రుడిని కలుసుకోవడానికి తాను అక్కడికి వెళ్లానని, సరిగ్గా అదే సమయంలో ఈ వ్యాపార దిగ్గజం తన కంట పడ్డాడని ఆయన వచ్చిన విషయాన్ని అక్కడి వారి ద్వారా తెలుసుకుని ఆయన నిబద్ధతను, నిరాడంబరతను ప్రపంచానికి తెలిజేయకుండా ఉండలేకపోయానంటూ పొందుపరుస్తూ ఆ అపార్ట్‌మెంట్ పార్కింగ్‌లో ఇద్దరు వ్యక్తులతో రతన్ టాటా మాట్లాడుతున్న ఫోటోని పోస్ట్ చేశాడు. ఇంతటి వృద్ధాప్యంలో కూడా తన ఉద్యోగిపై ఆయన చూపించిన ప్రేమ ఆదర్శవంతమయ్యిందని హ్యాట్సాఫ్ టూ రతన్ టాటా అంటూ కొన్ని వేలమంది నెటిజన్లు ఆయనను అభినందించారు.

కొన్ని లక్షల కోట్లకు అధిపతి అయినప్పటికీ సాదాసీదాగా 150 కిలోమీటర్లు కారులో వెళ్లి వచ్చిన రతన్ టాటాని చూసి మన నేతలు బుద్ధి తెచ్చుకోవాలి. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టి చార్టెర్డ్ విమానాలలోనూ, హెలికాప్టర్లలోనూ తిరగడం మాని రతన్ టాటా గారి లాగా ఆదర్శవంతులుగా నిలవాలి.

**– యం.చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.**

# కలెక్టర్ గంధం చంద్రుడు ఆదర్శం

అనంతపురం జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు దేశానికే ఆదర్శం. జిల్లాలోని దళిత, గిరిజన కాలనీలకు మహనీయుల పేర్లుపెడుతూ ఆయన తీసుకున్న నిర్ణయం కలెక్టర్లందరికీ ఆదర్శం. ఎస్సీ ఎస్టీలు, బడుగు బలహీన వర్గాల ప్రజలున్న కాలనీలకు మహనీయులైన డాక్టర్ అంబేద్కర్, మహాత్మా పూలే, మదర్ థెరిస్సా, జగజ్జీవన్‌రామ్..తదితర పేర్లు పెడుతూ కలెక్టర్ తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో సంతోషదాయకం. అనంతపురం జిల్లా కలెక్టర్‌గా గంధం చంద్రుడు బాధ్యతలు తీసుకున్నప్పటినుంచి ఆ జిల్లాలో పేదవర్గాల సంక్షేమానికి ఆయనెంతో కృషిచేస్తూ ప్రభుత్వ పథకాల విజయవంతంలోనూ కీలకభూమిక పోషిస్తున్నారు. ప్రజా కలెక్టర్‌గా, ఆదర్శ ఐఏఎస్‌గా ప్రజలచేత, ప్రభుత్వం చేత ప్రశంసలందుకుంటున్నారు. కలెక్టర్ గంధం చంద్రుడికి అభినందనలు.

**– డా. యస్.బాబురావు, కావలి.**

# మందుబాబులా!.. మజాకానా!..

• 2 రోజుల్లో 10 కోట్ల మందును గుటగుటా తాగిపారేశారు



***కేవలం రెండంటే రెండు రోజుల్లోనే మనజిల్లాలోని మందుబాబులు దాదాపు పదికోట్ల రూపాయల మందును గుటగుటా తాగేసి తమ తడాఖా చూపించారు. బాధ కలిగినప్పుడు, సంతోషం కలిగినప్పుడూ ఈ రెండు సందర్భాల్లోనూ మందుబాబులకు కావాల్సింది మందేనని, ఇలా అన్ని సందర్భాల్లోనూ తమకు మందే సరైన మందని మాటల్లో కాక డబ్బుల్లోనే చాటిచెప్పారు.***

2020 సంవత్సరం వెళ్లిపోతోందనే విషాదమో ఏమో డిసెంబరు 31న, 2021 కొత్త సంవత్సరం వచ్చిందనే ఆనందంతో కాబోలు జనవరి 1న.. ఈ రెండు రోజులూ పూటుగా మందుకొట్టి మరీ చిందులేశారు. ప్రపంచాన్నే గడగడలాడిస్తున్న కరోనాను కూడా ఏమాత్రం లెక్కచేయకుండా మద్యం కొనుగోళ్లకు పోటీలు పడ్డారు. ఒకవైపు మందుబాబుల తాగుడును తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని రకాల చర్యలు తీసుకుంటున్నా, మద్యం ధరలను భారీగా పెంచినా ఇలాంటివన్నీ తమనేమీ చేయలేవనే ధీమాతో.. తమ సంపాదనలను తామే గుల్ల చేసుకుంటూ జేబులో ఉన్న డబ్బునంతా విచ్చలవిడిగా ఖర్చుపెట్టేసి అందినంత నిషాని అందిపుచ్చుకుని అదే ఆనందమన్నట్లుగా తాగి ఊగేశారు. డిసెంబరు 31న 6 కోట్ల రూపాయల దాకా, జనవరి 1న మరో 4 కోట్ల రూపాయల దాకా మందుబాబులు మందుకోసం డబ్బు తగలేయడం చూసి మద్యం విక్రయాల లెక్కలుగట్టిన అధికారులు ఆశ్చర్యపోయారు. అయితే పోలీసులు పకడ్బందీ గస్తీ చేపట్టి ఎక్కడా మందుబాబుల ఆగడాలు లేకుండా..వీధుల్లో గలభాలు కానీ, ఎక్కడా ఎలాంటి ప్రమాదాలు కానీ జరగకుండా చూశారు. అయినా.. రేట్లు ఎంత పెరిగినా ఇంతపెద్ద మొత్తంలో మందుబాబులు ఇలా జల్సాగా మద్యం కొనుగోలు చేయడం అందరికీ విస్మయం కలిగిస్తోంది.

## పశువులకు వేసే...
# దాణాలో కూడా కల్తీయే!

• నెల్లూరులో మరో మోసపు వ్యాపారం
• గుట్టు రట్టు చేసిన విజిలెన్స్ అధికారులు

వ్యాపారంలో మోసాలకు అంతే ఉండడం లేదు. చివరికి పశువులకు వేసే తవుడులో కూడా కల్తీచేసి కొందరు వ్యాపారులు తమ పబ్బం గడుపుకుంటున్నారంటే ధనార్జనకు ఎంతటి నీచానికైనా దిగజారిపోతున్నారా అనిపిస్తోంది. మూగజీవాలకు వేసే దాణాలో కూడా గుట్టుచప్పుడు కాకుండా సున్నం, లైమ్ పౌడర్లు కలిపేసి అమాయకులైన రైతులకు అమ్మేస్తున్న వైనం నెల్లూరులో బట్టబయలైంది. ఈ కల్తీ సమాచారం తెలిసిన వెంటనే విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు నగరంలోని మూడోమైలు వద్దనున్న మంగళదిబ్బ ప్రాంతంలోని ఓ గోడౌన్‌పై దాడి చేసి ఈ మోసపు బండారాన్ని బయటపెట్టారు. ఈనెల 4న రీజనల్ విజిలెన్స్ ఆఫీసర్ రాజేశ్వరరెడ్డి, ఇన్స్‌పెక్టర్ మాణిక్యాలరావు, డిసిటిఓ విష్ణురావుతో పాటు వారి సిబ్బంది అంతా కలసి ఆ గోడౌన్‌లో తనిఖీలు చేసి, వ్యాపారులు ఈ కల్తీ దాణాను ఎవరికీ అనుమానం రాకుండా పలు కంపెనీలకు చెందిన బస్తాల్లో నింపి రైతులకు అమ్మేస్తున్నట్లు గుర్తించారు. ఆ వ్యాపారులు, సిబ్బందిపై విజిలెన్స్ అధికారులు క్రిమినల్ కేసులు పెట్టేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ కల్తీ కోసం కలిపే సున్నం, అగ్రి లైమ్ పశువులకు ప్రమాదకరమైనదని నిపుణులు చెప్తున్నారు. నోరులేని మూగజీవాలకు పెట్టే తవుడును కూడా కల్తీ చేసి ఆ డబ్బుతో పాటు పాపం కూడా మూటగట్టుకుంటున్న ఇలాంటి వ్యాపారుల పట్ల రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి మరి!...



## పట్టింపులకు పోయి
# రైతులను అన్యాయం చేయకండి

**- మాజీమంత్రి సోమిరెడ్డి**



కేంద్రం కొత్తగా తెచ్చిన వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన ఉద్యమం 39 రోజులకు చేరిందని, ఒకవైపు ఎముకలు కొరికే చలి, మరోవైపు జోరువానలో కూడా రైతులు ప్రాణాలకు తెగించి తమ సమస్యలు తీర్చాలంటూ ఆందోళన చేస్తున్నారని, కేంద్రప్రభుత్వం పట్టింపులకు పోయి రైతులను అన్యాయం చేయవద్దని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈనెల 4న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయమైన డిమాండ్లనే ఆమోదించమంటున్నారని, ఎమ్మెస్పీని చట్టబద్ధం చేయడం న్యాయమని ఆయన తెలిపారు. మార్కెటింగ్ వ్యవస్థను యధాతథంగా కొనసాగిస్తూ మరింత పటిష్టం చేయాలని, తెలుగు రాష్ట్రాల్లో 60 శాతం పైగానే రైతులు మార్కెట్‌యార్డుల ద్వారా పంటను అమ్ముకుంటున్నారని, అదంతా మోసాలకు తావులేకుండా సాగిపోతోందని పేర్కొన్నారు. బడా కంపెనీలకు పరిమితి లేకుండా నిల్వలు పెంచుకునే సౌలభ్యం ఇవ్వడంతో చివరికది ధరలపై ప్రభావం చూపుతుందని, పెద్దపెద్ద కంపెనీలు వచ్చి లక్షల టన్నులు నిల్వ చేసుకుని మార్కెట్‌లో కొరత వచ్చాక ధరలు పెంచితే పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. దేశంలో దాదాపు 60 శాతం మంది వ్యవసాయ కూలీలేనని, వీరి విషయంలో మొండి వైఖరి తగదని అంటూ, ప్రధాని నరేంద్రమోడీ, అమిత్‌షా ఈ విషయాల పట్ల సానుకూల ధోరణి ప్రదర్శించాలన్నారు. మీరు ప్రిస్టేజీకి పోకుండా ఒక మెట్టు దిగి రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తే దేశమంతా మిమ్మల్ని అభినందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఇళ్ల పట్టాలు పంపిణీ.. చరిత్రాత్మకం

**- ఎమ్మెల్యే కాకాణి**



రాష్ట్రంలో పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చొరవతో ఇళ్ల స్థలాల పట్టాలు అందజేయడం చరిత్రాత్మకమని, ఇదెంతో సంతోషదాయకమని సర్వేపల్లి శాసన సభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈనెల 5న పొదలకూరు మండలంలోని బిరదవోలులో లబ్ధిదారులకు ఇళ్ళపట్టాలు అందజేశారు. పేదలకు ఇళ్ళ పట్టాల పంపిణీతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలచిపోతారని ఆయన కొనియాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో దాదాపు 18వేల కుటుంబాలకు తాను ఇళ్ళ పట్టాలు పంపిణీచేసే అదృష్టం తనకు కలిగిందన్నారు. పట్టాల పంపిణీతో సర్వత్రా పండుగ వాతావరణం ఏర్పడిందన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాల పట్టాలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వాతి, ఎంపిడిఓ నారాయణరెడ్డి, వైకాపా నాయకులు పెదమల్లు రమణారెడ్డి, మహిళా నాయకురాలు సువ్వల మంజుల, బిరదవోలు మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అడ్మిషన్లలో ఫస్ట్.. ఎన్‌బికెఆర్



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కాలేజి బిటెక్ మొదటి సంవత్సరంలో 2020-21 సంవత్సరానికి జరిగిన అడ్మిషన్లలో ప్రథమస్థానం సాధించింది. తొలి దశ కౌన్సిలింగ్‌లోనే 628 మందితో కన్వీనర్ కోటా అడ్మిషన్లు జరిగి జిల్లాలోనే మొదటి స్థానం సాధించడం విశేషం.

ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఈనెల 4న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్, అనుబంధ బ్రాంచ్‌లలో 229 మంది విద్యార్థులు, ఇసిఇలో 139 మంది, ట్రిపుల్‌ఇలో 91 మందితో కన్వీనర్ కోటా సీట్లు పూర్తిగా భర్తీ అయ్యాయని తెలిపారు. అదేవిధంగా మెకానికల్‌లో 94, సివిల్‌లో 75 సీట్లు భర్తీ అయ్యాయని, కళాశాలలోని అధ్యాపకుల స్థాయిని, కళాశాలలో లభిస్తున్న మౌలిక వసతులు ప్రమాణాలను తెలుసుకున్న విద్యార్థులు అధికసంఖ్యలో తమ కళశాలను ఎంపిక చేసుకున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అనేక పరిశ్రమల వారితో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, బిటెక్ డిగ్రీతో పాటు ఆటోమొబైల్, రోబోటిక్ రంగాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ఎన్‌బిఎ, ఎన్‌ఏసిసి (నాక్) అటానమస్ స్థాయి కలిగి, ఇంతటి మెరుగైన విద్యాప్రమాణాలు గల కళాశాలలో మెకానికల్, సివిల్ బ్రాంచ్‌లలో మిగిలిన మరికొన్ని సీట్లను రెండవ విడత కౌన్సిలింగ్‌లో విద్యార్థులు ఎంచుకుని, ప్రభుత్వం అందించే పూర్తిస్థాయి ఫీజు రీఇంబర్స్‌మెంట్‌ను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. తమ కళాశాలలో సీట్లు పొందిన విద్యార్థులకు కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలియజేశారని ఆయన పేర్కొన్నారు.




### టిడిపి నాయకులు
## అర్థంపర్థం లేని విమర్శలు మానుకోవాలి
**మంత్రి డా. అనిల్**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పేదలకు ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకుంటుంటే టిడిపి నాయకులు అర్థంపర్థం లేని రాద్ధాంతాలు చేయడం ఏమిటని, అలాంటి విమర్శలు మానుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఈనెల 5న ఆయన నెల్లూరులోని 9, 13 డివిజన్‌లలో పేదలకు ఇళ్ళపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం ప్రజల కోసం ఏదైనా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని తెలిస్తే కొందరు అవాంతరాలు సృష్టిస్తున్నారని, ఏ మారుమూల ప్రాంతా ల్లోనో ఉన్న దేవుడి విగ్రహాలు ధ్వంసం చేసి వివాదాలకు దారితీస్తున్నారని, అది మంచిపద్ధతి కాదని అన్నారు. ఎవరిని ఎక్కడ పెట్టాలో ఆ దేవుడికి బాగా తెలుసునని అన్నారు. మాజీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.

## రేషన్ వాహనాలు వచ్చేశాయ్



ఎట్టకేలకు రేషన్ వంపణీ వాహనాలు నెల్లూరుకు వచ్చేశాయి. ఇంటింటికి రేషన్ సరుకులు అందించేందుకు ప్రభుత్వం 524 ప్రత్యేక వాహనాలను కేటాయించగా వాటిలో 146 వాహనాలు ఈనెల 4న నగరానికి చేరుకున్నాయి. స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంకు వచ్చిన ఈ వాహనాలను జేసీ హరీంద్రప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచి రేషన్ సరుకులను ఇంటింటికీ వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సివిల్ సప్లయిస్ ఎం.డి రోజ్‌మాండ్, డిఎస్‌ఓ బాలకృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ బడుల సమస్యలు తీర్చండి
**ఆర్‌జేడీకి అపస్మా నాయకుల వినతి**

రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 4న నెల్లూరుకు వచ్చిన ఆర్‌జేడిని కలిసి అపస్మా నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలలకు గుర్తింపును మరో 10 సంవత్సరాలకు పొడిగించాలని, కరెంటు బిల్లులు కేటగిరి–2కు మార్చాలని, జిఓఎంఎస్ నెం.1ని కొనసాగించాలని, పబ్లిక్ స్థలాలను ప్లేగ్రౌండ్‌లుగా ఉపయోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని, చైల్డ్ ఇన్‌ఫోలో డ్రాప్‌బాక్స్‌ను పునరుద్ధరించడంతో పాటు టీసీలతో మాత్రమే విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకునేలా ఏర్పాటుచేయాలని కోరారు. ఆర్‌జేడిని కలిసిన వారిలో అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి, ఎన్ శ్రీధర్, నగర అధ్యక్షుడు శౌరెడ్డి తదితరులున్నారు.

### రంగనాథస్వామి అధ్యయనోత్సవాలకు
## తరలివచ్చిన భక్తులు

నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో గతనెల 15 నుంచి ఈనెల 4వ తేదీ దాకా కన్నులపండువగా జరిగిన అధ్యయనోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అధ్యయనోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఆలయ అర్చకులు స్వామివార్లకు ప్రత్యేకపూజలు చేసి శాత్తుమొరై నిర్వహించారు. ఆలయ పాలకమండలి ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, ఇ.ఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

### వేణుగోపాలస్వామి దేవాలయంలో

నెల్లూరు, మూలాపేటలో కొలువైవున్న రుక్మిణి సత్యభామాదేవి సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో కూడా అధ్యయనోత్సవాలు ఇదే రోజుల్లో వైభవంగా జరిగాయి. ఈనెల 4న ముగింపు వేడుకల్లో భక్తులు భారీగా పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ మన్నెం లక్ష్మీనాథరెడ్డి, ఇ.ఓ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

## మోడల్ స్కూల్స్ ఏడీగా ఉష

విద్యాశాఖలో సీనియర్ అధికారిగా ఉంటూ జడ్పీ డెప్యూటీ ఇ.ఓగా, కావలి ఇన్‌ఛార్జి డెప్యూటీ ఇఓగా పనిచేస్తున్న ఉషను ఏపి మోడల్‌స్కూల్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమిస్తూ పాఠశాల విద్యా కమిషనర్ చినవీరభద్రుడు తాజా ఉత్తర్వులిచ్చారు. దీంతో ఆమె ఈనెల 2న నెల్లూరులోని డిఇఓ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు.

# నెల్లూరు కబుర్లు

## విపిఆర్ ఇంట్లో.. కొత్త ఏడాది సందడి



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో 2021 కొత్త ఏడాది వేడుకలు సందడిగా జరిగాయి. జనవరి 1వ తారీఖున జిల్లాకు చెందిన అనేకమంది రాజకీయ, రాజకీయేతర ప్రముఖులు, అధికార, అనధికార ప్రముఖులు ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ వారు తీసుకువెళ్లిన కేక్‌ను విపిఆర్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. 2020 సంవత్సరం చాలా చేదు అనుభవాలను మిగిల్చిందని, గత అనుభవాలన్నీ ఒక పీడకలలా మర్చిపోయి 2021లో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ సందర్భంగా విపిఆర్ ఆకాంక్షించారు.

## ఇది పన్నుల ప్రభుత్వం
**కోటంరెడ్డి శీనయ్య విమర్శ**



ఇది పన్నుల ప్రభుత్వమని, పథకాల అమలుకోసం ప్రజలపై పన్నుల భారం మోపడం ఏమిటని టిడిపి నెల్లూరు నగర ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. ప్రభుత్వం పన్నులు పెంచడమే పనిగా పెట్టుకుందంటూ దుయ్యబట్టారు. ఈనెల 4న నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటిపన్నుల దగ్గరనుంచి దుకాణాల పన్నుల దాకా అన్నిటినీ పెంచేసి ప్రజలపై భారం వేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఇంటిపన్నులు పెంచడం దారుణమని, ప్రజలపై పన్నుల భారం మోపితే సహించేది లేదని చెప్పారు. పెంచిన పన్నులు తగ్గించేదాకా విశ్రమించేది లేదని, పన్నుల తగ్గింపు కోసం టిడిపి చేస్తున్న ఆందోళనకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలసిరావాలన్నారు. టిడిపి నాయకులు ధర్మవరం సుబ్బారావు, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, మస్తాన్, పసుపులేటి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో జనసేన సత్తా చాటాలి
**కార్యకర్తలకు నాయకుల పిలుపు**



జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలని, తిరుపతి పార్లమెంట్‌కు జరిగే ఉప ఎన్నికల్లో జనసేన తన సత్తా చూపాలని జనసేన నాయకులు వెంకటగిరి నియోజకవర్గ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈనెల 3న జనసేన నాయకుడు గూడూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాపూరులో కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. జనసేన రాష్ట్ర నాయకుడు మనుక్రాంత్ తరపున జనసేన నాయకుడు కిషోర్ గునుకుల మాట్లాడుతూ తిరుపతి ఉప ఎన్నికల్లో అభ్యర్థిగా అధిష్ఠానం ఎవరిని నిర్ణయించినా వారిని బలపరచేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. క్రియాశీలక సభ్యత్వంలో పేర్లు నమోదుచేసుకుని అందరూ పార్టీలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు, గూడూరు నియోజకవర్గం నాయకులు తీగల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### అర్హులందరికీ..
## 'అమ్మ ఒడి' అందాలి
**– విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్**




చదువుకు పేదరికం అడ్డు కాకుడదనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన 'అమ్మ ఒడి' పథకం అర్హులందరికీ అందించేలా అధికారులు కృషిచేయాలని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈనెల 4న ఆయన నెల్లూరుకు వచ్చి మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలసి ఈనెల 11న ముఖ్యమంత్రి సభ నిర్వహించే ఎస్‌విజిఎస్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ కోవిడ్ నేపథ్యంలో రాష్ట్రానికి ఆదాయం బాగా తగ్గినా అమ్మ ఒడి పథకానికి సరైన సమయంలో నగదు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మంత్రి అనిల్ మాట్లాడుతూ నెల్లూరులో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశంచారు.

## ఎంబిఏలో సత్తాచాటిన కృష్ణచైతన్య



విఎస్‌యు తాజాగా విడుదల చేసిన ఎంబిఏ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు తమ సత్తా చాటారు. తమ కళాశాలకు చెందిన పి.శ్రావణశృతి, పి.హరిత 535 మార్కులు సాధించి యూనివర్శిటీ స్థాయిలో టాపర్లుగా నిలిచారని కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా 527 మార్కులు సాధించి సిహెచ్ తేజస్విని ద్వితీయస్థానంలో నిలిచిందని, ఈ ఫలితల్లో తమ కళాశాల విద్యార్థులు 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరినీ వారు ఈనెల 4న కళాశాలలో ఏర్పాటుచేసిన సభలో అభినందించారు. ప్రిన్సిపాల్స్ మల్లికార్జునయ్య, టి.జ్యోతి, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## కెఎన్‌ఆర్ టీచర్.. మాల్యాద్రికి డాక్టరేట్



నెల్లూరులోని బివినగర్‌లో ఉన్న కెఎన్‌ఆర్ ఉన్నతపాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆరుమూళ్ళ మాల్యాద్రి అర్థశాస్త్రంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. 'ఇంపాక్ట్ ఆఫ్ సోషియో ఎకనమిక్ స్టేటస్ ఆన్ అకడమిక్ పర్ఫార్మెన్స్– ఏ కేస్ స్టడీ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ ఇన్ నెల్లూర్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై తన పరిశోధన గ్రంథాన్ని డా.కె.రాధిక పర్యవేక్షణలో సమర్పించినందుకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయం ఆయనకు డాక్టరేట్‌ను బహుకరించింది. మాల్యాద్రి గత రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయునిగా పనిచేస్తూ విద్యార్థుల సామాజిక ఆర్థిక పరిస్థితులు పదవ తరగతి ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో తన పరిశోధన గ్రంథంలో వివరించడం విశేషం.

## మెప్మా పీడీగా రవీంద్ర

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా డి.రవీంద్ర ఈనెల 5న నెల్లూరులోని మెప్మా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు అందజేయడంలో నిబద్ధతగా పనిచేస్తానని చెప్పారు.

## హ్యాపీ న్యూఇయర్ సీఎం సార్...

### ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన పరిశ్రమల మంత్రి



జనవరి 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలుసుకున్న రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రెట్టింపు ఉత్సాహంతో 2021లో ప్రజాసంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని, రాష్ట్రాన్ని పరిశ్రమల ఖిల్లాగా అభివృద్ధి చేయాలని, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దండిగా కలిగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గౌతమ్‌రెడ్డికి సూచించినట్లు తెలిసింది.

## జనవరి 20 దాకా ఇళ్ళస్థలాలు ఇస్తాం

### వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి జగన్



రాష్ట్రంలో పేదలకు ఇళ్ళస్థలాల పంపిణీ కార్యక్రమం జనవరి 20 దాకా కొనసాగిస్తున్నామని, ఇప్పటిదాకా 39 శాతం ఇళ్ళస్థలాల పంపిణీ పూర్తయిందని, 17వేలకు పైగా కాలనీల్లోని 9,668 వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ళస్థలాలను పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లాల్లోని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈనెల 5న ఆయన అమరావతిలోని తన క్యాంప్‌కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతూ పాలనలో పారదర్శకతను తారస్థాయికి తీసుకువెళ్ళామని, ఇకముందు కూడా దీనిని కొనసాగించాలని చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీలు హరేందిరప్రసాద్, డా.ఎన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆక్వా రైతులూ!..

## కల్తీ ఫీడ్‌తో జాగ్రత్త

ఆక్వా రైతులూ.. కల్తీ ఫీడ్‌తో జాగ్రత్త అంటూ మత్స్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్లలో వచ్చే రకరకాల ఫీడ్‌లను జాగ్రత్తగా పరిశీలించుకోవాలని, లేకుంటే కల్తీ ఫీడ్‌తో నష్టపోక తప్పదని అంటున్నారు. అధిక లాభాలను ఆర్జించడమే ధ్యేయంగా ప్రైవేట్ వ్యాపారులు కల్తీ మేతను అమ్మేస్తున్నారని, రైతులు మోసపోకుండా అధికారుల సలహా తీసుకుని ఆక్వా సాగు చేపట్టాలని స్పష్టం చేస్తున్నారు. ఈనెల 5న ముత్తుకూరులోని మత్స్యకళాశాల ఆడిటోరియంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఎన్ఎఫ్‌డిబి సహకారంతో 'మంచినీటి చేపల పెంపకంలో ఉత్తమ యాజమాన్య విధానం' అనే అంశంపై ఆక్వారైతులకు మూడురోజుల శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త హరిప్రసాద్, ఎఫ్‌డిఓ సంజయ్ స్టీఫెన్, డెప్యూటీ డైరెక్టర్ జ్యోతి తదితరులు పాల్గొని రైతులకు ఆక్వా సాగులో తీసుకోవాల్సిన మెళకువల పట్ల అవగాహన కలిగించారు.

### సావిత్రిబాయి పూలే

## జీవితం ఆదర్శప్రాయం

దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళల విద్యకు బాటలు వేసిన సామాజిక ఉద్యమ నాయకురాలు సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శప్రాయమని వక్తలు కొనియాడారు.

సావిత్రిబాయి పూలే 190వ జయంతి సందర్భంగా ఈనెల 3న నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి వారి సేవలను స్మరించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల చైతన్యసమితి రాష్ట్ర కోశాధికారి అక్కుల శ్రీరామ్‌కుమార్, ప్రచార కార్యదర్శి ఆరంబాకం చంద్రశేఖర్, నెల్లూరు రీజనల్ కమిటీ సభ్యులు రాంప్రసాద్, మహిళా విభాగం నాయకురాలు పద్మజ తదితరులు పాల్గొని పూలే దంపతులకు నివాళులర్పించారు.

### ఇల్లు లేదని పేదోళ్లెవరూ..

## ఇక బాధపడకూడదు

**- జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**



తమకు ఇల్లు లేదని పేదోళ్ళెవరూ ఇక బాధపడకూడదని, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పేదలందరికీ ఇళ్ళ స్థలాల పట్టాలను పంపిణీ చేస్తోందని, జిల్లా చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో ప్రభుత్వం 1477 లేఅవుట్లలో 1,73,580మంది నిరుపేదలకు ఇళ్ళ పట్టాలు అందజేయడమే కాక, వారికి ఇళ్ళు కూడా నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 4న ఆయన ఇందుకూరుపేటలో జరిగిన ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధిపనుల ప్రారంభోత్సవంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు ఇంతపెద్ద ఎత్తున ఇళ్ళ పట్టాలివ్వడం చరిత్రాత్మకమైన విషయమన్నారు. ఇల్లు లేని పేదలు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం ఇళ్ళ పట్టాను ఇస్తుందని, మౌలిక సదుపాయాలకు ఎలాంటి లోటు లేకుండా అభివృద్ధి చేసిన ఇళ్ళ ప్లాట్లను ప్రభుత్వం పేదలకు అందిస్తోందని వివరించారు.

### జగన్ సీఎం అయ్యాక..


## రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు

**- కొనియాడిన మంత్రి జయరాం**

రాజు బాగుంటే రాజ్యం బాగుంటుందని పెద్దలు చెప్తున్నట్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పదవీ స్వీకారం చేసిన తర్వాత నుంచి రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురుస్తూ రైతులు సుఖసంతోషాలతో ఉన్నారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం కొనియాడారు. ఈనెల 5న ఆయన దుత్తలూరు మండలంలోని నందిపాడు గ్రామంలో జరిగిన వాల్మీకి సంఘీయుల ఆత్మీయసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాల్మీకి కులస్తులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు సిఎం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర వాల్మీకి సంఘం నాయకుడు పిక్కిలి రవీంద్రబాబు, ఉండేల గురవారెడ్డి పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





# సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ఠ



గూడూరు షిరిడిసాయి నగర్‌లో ఉన్న సాయిబాబా మందిరంలో డిసెంబర్ 31వ తేదీ సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం వాచస్పతి, వారి గురువు ఆధ్వర్యంలో డిసెంబర్ 29 నుండి 31 వరకు వివిధ పూజాకార్యక్రమాలు నిర్వహించి 31వ తేదీ ఉదయం 11.16 నుండి 11.21 గంటల లోపల సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ విగ్రహాన్ని చదలవాడ హరిప్రసాద్, వారి కుటుంబ





సభ్యులు సమర్పించారు. శ్రీ శిరిడి సాయిబాబా మందిరం వ్యవస్థాపకులు డాక్టర్ సి.ఆర్.రెడ్డి, శ్రీ శిరిడి సాయి కల్చరల్ మిషన్ కార్యదర్శి శ్రీకంటి రామ్మోహన్‌రావు, వారి సతీమణి పి.ఎస్.రాజ్యలక్ష్మి, అధ్యక్షులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, వారి సతీమణి డాక్టర్ సి.రోహిణి, కమిటీ సభ్యులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్ధప్రసాదాలు స్వీకరించారు. ఈ విగ్రహంతో పాటు దక్షిణా మూర్తి, దత్తాత్రేయ విగ్రహాలను కూడా ప్రతిష్టించడం జరిగింది.

# రామమందిర నిర్మాణంలో భాగస్వాములవుదాం




హిందువుల దశాబ్దాల కల నెరవేరుతోందని, రామజన్మభూమి అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలని కోట సునీల్‌కుమార్, ఎమ్.మురళీరెడ్డి అన్నారు. స్థానిక కేశవ నిలయంలో విహెచ్‌పి ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. రామ మందిర నిర్మాణంలో హిందువులు భాగస్వాములయ్యేలా విహెచ్‌పి కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం ఇళ్ళకొచ్చే సేవకులకు తమవంతు సాయం చేయాలన్నారు. విహెచ్‌పి ప్రతినిధులు మల్లికార్జున్, శ్రీనివవాసులు, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లూయీ బ్రెయిలీ జయంతి

- వేమూరి రాజేంద్రప్రసాద్‌కు అవార్డు



నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఈనెల 3న లూయీ బ్రెయిలీ జయంతి జరిగింది. మోపూరు పెంచలనాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న వేమూరి రాజేంద్రప్రసాద్‌కు లూయీ బ్రెయిలీ అవార్డు-2021ని బహుకరించారు. ట్రస్ట్ నిర్వాహకుడు, ప్రముఖ కవి మోపూరు పెంచల నరసింహం మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రతిభ కలిగిన దివ్యాంగులకు ప్రోత్సాహకంగా ఈ అవార్డును ప్రదానం చేస్తున్నామన్నారు. చిన్నతనంలోనే చూపు కోల్పోయినా ఎంతో ఆత్మస్థైర్యంతో ఉన్నత విద్య చదువుకుని సమాజంలో ఉన్నతస్థాయికి ఎదిగిన రాజేంద్ర ప్రసాద్ అందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. అనంతరం రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కె.రాజా, సుభద్రాదేవి, అవ్వారు శ్రీధర్‌బాబు, షంషుద్దీన్, శివ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# ఆలయాల అభివృద్ధికి కృషి



గూడూరు నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు పట్టణంలోని శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం ఈ నెల 4వ తేదీ ఘనంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షులుగా బొమ్మిడి శ్రీనివాసులు, సభ్యులుగా దువ్వూరు వినయ్‌కుమార్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులు, సంపూర్ణ, శ్రీవాణి, శాంతి, జయశ్రీ, ఎక్స్‌అఫిషియో సభ్యుడు రామమునితో ఆలయ ఇ.ఓ తాతా శ్రీనివాసరావు ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తానని తెలిపారు. వైయస్సార్సీపీ నాయకులు మేరిగ మురళి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, నాసిన నాగులు, గిరిబాబు, బత్తిన విజయకుమార్, రాజారెడ్డి, బాబురెడ్డి, గూడూరు వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీఛైర్మెన్, ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, చిల్లీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లకొండ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.

# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్



గూడూరులోని గాంధీనగర్ సచివాలయం పరిధిలో ఉన్న వార్డుల్లో మునిసిపల్ కమిషనర్ ఓబులేసు ఈనెల 6న పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. తిలక్‌నగర్‌లో కాలువ పూడికతీత పనులకు సంబంధించి పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలిచ్చారు. వర్షం కారణంగా మురికినీళ్ళు రోడ్లపైకి రాకుండా కాలువల్లో పూడిక తీయాలని సూచించారు.

# పారిశుద్ధ్య సిబ్బందికి ఆత్మీయ సత్కారం



గూడూరులోని మునిసిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి ఇటీవల స్థానిక ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారాలు నిర్వహించారు. కరోనా నేపథ్యంలో గూడూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు అత్యుత్తమ సేవలందించినందుకు 20 మంది పారిశుద్ధ్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్పొరేషన్ రవికుమార్ సహాయ సహకారాలతో జరిగిన ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అపూర్వమంటూ కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు, రెవెన్యూ అధికారి కృష్ణారెడ్డి చేతుల మీదుగా వారికి జ్ఞాపికలు, శాలువలు బహుకరించి సత్కరించారు. సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్ర నాథ్‌రెడ్డి, కార్యదర్శి జి.చంద్రశేఖర్, కోశాధికారి కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ధనుంజయ రెడ్డి, గ్రానైట్ ప్రభాకర్, పురంధర్‌రాజు, ఐటిఐ ప్రభాకర్, చల్లా శ్యామ్, వాచ్‌షాప్ రాము, పూర్ణచంద్ర, శ్రీను, కోఆర్డినేటర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ నివేశన స్థలాలు



అర్హులందరికీ నివేశ స్థలాల పట్టాలు అందజేయనున్నట్లు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ అన్నాడు. అల్లంపాడు, చంద్రశేఖరపురం గ్రామాల్లోని సుమారు 48మంది లబ్దిదారులకు ఇటీవల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి నాలుగెకరాల భూమిని ప్రభుత్వానికి ఇవ్వడం అభినందనీయమన్నాడు. ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడివో భవాని తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం... ప్రాణదానం

**- డాక్టర్ శైలజ**



ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానమని ప్రాంతీయ ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ శైలజ అన్నారు. గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా వున్న వారందరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని సూచించారు. కరోనా సమయంలో నిల్వలు తగ్గిపోవడంతో అత్యవసర సమయంలో రక్తం అందక పలువురు మృతి చెందినట్లు చెప్పారు. యువత స్వచ్ఛంధంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని సూచించారు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగానూ జీవించవచ్చని తెలిపారు. వైద్యులు రామకృష్ణ, శకుంతల, సంస్థ ప్రతినిధులు కడివేటి చంద్రశేఖర్, సురేంద్రనాథ్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలకు భద్రత కల్పించాలి

**- డిఎస్‌పి**



వెంకటగిరి సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలతో గూడూరు డిఎస్పీ ఎం.రాజగోపాలరెడ్డి ఈనెల 6న సమావేశం నిర్వహించి దేవాలయాలకు భద్రత కల్పించే విషయంలో పలు సూచనలిచ్చారు. అన్ని ఆలయాలకు భద్రత కల్పించాలన్నారు. ఆలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, జియో ట్యాగింగ్ నిర్వహించాలని సూచించారు.

# దివ్యాంగులకు నిత్యావసర సరుకులు



గూడూరు త్యాగరాజ వీధిలోని కల్యాణవీరభద్ర స్వామి దేవాలయంలో ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళామండలి వారి సహకారంతో 35 మంది దివ్యాంగులకు ఈనెల 5న నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో, దాత సౌజన్యమ్మ సహాయంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. మరుబోయిన చిరంజీవి గౌడ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రావణ్ దాతృత్వంతో 35 మంది దివ్యాంగులకు రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పిండివంటలు కూడా అందించారు. రెడ్‌సంస్థ ప్రెసిడెంట్ జానా సుధీర్, శ్రీనివాసాచారి, పల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


# దేవాలయాలను కాపాడాలి

## కావలిలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల ర్యాలీ

హిందూ దేవాలయాలను సంరక్షించాలంటూ కావలిలోని హిందూ సంఘాలన్నీ కలసికట్టుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. దేవాలయాల పరిరక్షణ కోసం ఈనెల 4న కావలిలో భారీ ర్యాలీ జరిగింది. బిజెపి నేతలు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, పలు ఆలయాల పూజారులు, భక్తులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అర్చకసంఘం అధ్యక్షుడు సుబ్బుస్వామి, సద్భావన సాధన సంఘం అధ్యక్షుడు జి.మారుతీరామారావు, శంకరమఠం అధ్యక్షుడు కసవరాజు శ్రీనివాసరావు, బిజెపి పట్టణ అధ్యక్షుడు కె.బ్రహ్మానందం, నాయకులు బాలమురళి, సుధీర్, మహిళా నాయకురాళ్ళు పద్మావతి, శ్రీదేవి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రత్నంనాయుడు, కార్తీక్ పాల్గొని మాట్లాడారు. హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని, హిందూ ఆలయాలకు తక్షణం రక్షణ కల్పించాలని వారు కోరారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఇప్పటిదాకా 120 హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని, అయినా ప్రభుత్వంలో చలనం లేదని, దేవాలయాలను పరిరక్షిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించాలని, ఆలయాలపై దాడులకు బాధ్యత వహిస్తూ దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. దేవాలయాలను పరిరక్షించాలంటూ నినాదాలు చేస్తూ కావలి జాతీయ రహదారి మీదుగా ఆర్డీఓ కార్యాలయం దాకా ర్యాలీ చేశారు. ఆ తర్వాత ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.

### కాలధర్మం

## డాక్టర్ పి.యస్.ఆర్.కె.మూర్తి



పేదోళ్ళ వైద్యుడిగా పేరు గడించిన డాక్టర్ పెల్లూరు శివరామ కృష్ణమూర్తి జనవరి 7వతేదీ తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 76 సంవత్సరాలు. ఆయన జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగానే కాకుండా నెల్లూరు మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా కూడా పనిచేశారు. నెల్లూరు మధ్వపతి వారి అగ్రహారం(ఎం.వి.అగ్రహారం)లో 5రూపాయల డాక్టర్‌గా రెండు దశాబ్దాలకుపైగా తన సేవలందించి, అనంతరం తన దగ్గరకు వచ్చే పేషెంట్ల విజ్ఞప్తి మేరకు ఫీజును 10రూపాయలుగా పెంచిన మానవతా వాది డాక్టర్ పి.ఎస్.ఆర్.కె.మూర్తి. 70ఏళ్ళ వయస్సులో కూడా పేషంట్ల ఇంటివద్దకే వెళ్లి వాళ్ళకి వైద్యం అందించేవాడు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో ఉంటూ జనవరి 7వతేదీ ఉదయం 10.30 గంటలకు కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఆయన అనారోగ్యం పాలైనప్పటి నుండి మూర్తిగారి చిన్నకుమారుడు డాక్టర్ శివకార్తిక్ తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ వైద్యసేవలందిస్తున్నాడు. డాక్టర్ కమూర్తి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### 12న అల్లూరు పోలేరమ్మ

## తిరునాళ్ళకు భారీ ఏర్పాట్లు



అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి గ్రామోత్సవం ఈనెల 12న అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 5న ఈ ఉత్సవానికి రెండవ చాటింపు వేశారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, గ్రామప్రజలు, పెద్దలు, ప్రముఖులు, దాతలు, ప్రజల సహకారాలతో అమ్మవారి గ్రామోత్సవాన్ని వేడుకగా నిర్వహించేందుకు అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ అన్ని సన్నాహాలు చేస్తోంది.

### జొన్నవాడ కామాక్షమ్మకు

## 18 లక్షలకు పైగానే రాబడి

జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి దేవాలయానికి తాజాగా 18 లక్షలకు పైగానే రాబడి వచ్చింది. ఈనెల 4న ఆలయంలోని హుండీలను లెక్కించగా గత ఏడాది అక్టోబర్ 28 నుంచి ఇప్పటి దాకా భక్తులు సమర్పించిన కానుకలు 18,36,290 రూపాయలు వచ్చాయని ఆలయ ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నాడు. కానుకల్లో భాగంగా 91.950 గ్రాముల బంగారు, 449.10గ్రాముల వెండి, ఒక అమెరికా డాలర్, కెనడా సింక్ 5 డాలర్ నోట్లు 3 వచ్చాయన్నాడు. ఈ లెక్కింపులో ఆలయ పాలకమండలి సభ్యులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, గుమ్మా ప్రమీలమ్మ, ఇన్నమూరి నరసింహారావు, శ్రీనివాసులురెడ్డి, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ పద్మజకు 'నేషనల్ నైటింగేల్' పురస్కారం

### - జాతీయస్థాయిలో మెరిసిన సింహపురి ఆణిముత్యం



దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి పురస్కారం.. సేవకు ప్రతిరూపమైన 'ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు'కు నెల్లూరు జిల్లావాసి, సమాజ సేవాభిలాషి డాక్టర్ పద్మజ మునుస్వామి ఎంపిక కావడం సంతోషదాయకం. అంతేకాదు మన జిల్లావాసి ఇంతటి గొప్ప అవార్డును సాధించడం సింహపురిసీమకే గర్వకారణం కూడా. పుట్టింది చిన్న పల్లెలో అయినా సేవాభావంతో ఆమె జాతీయ స్థాయి గుర్తింపును పొందగలగడం విశేషం. నెల్లూరుజిల్లా సముద్రతీర ప్రాంతమైన తడ మండలంలో ఉన్న చిన్నమాంబట్టు అనే చిన్న పల్లెటూరికి చెందిన ఆమె జాతీయస్థాయిలో పేరొందిన కళాశాలల్లో చదువుకోవడమే కాక, సమాజ సేవాభిలాషతో సమాజానికి అకుంఠితమైన సేవలందించే నర్సింగ్ విద్యారంగంలో ఆణిముత్యమై ప్రకాశించారు. న్యూఢిల్లీలోని ఎయిమ్స్ మెడికల్ కాలేజీలో నర్సింగ్ చదువుకొని, 1983లో అఖిలభారత వైద్యవిజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో చేరి, అక్కడే బిఎస్‌సి నర్సింగ్ ఆనర్స్ పట్టా పొంది, అదే కాలేజీలో 1993 వరకు నర్సింగ్ విద్యారంగానికి ఆమె అమూల్యమైన సేవలందించారు. ఆ తర్వాత తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. గత 26ఏళ్ళుగా ఆ ఆసుపత్రిలో వివిధ హోదాల్లో పని చేసిన ఆమె ఇప్పుడు స్విమ్స్ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్‌గా, వైస్‌ప్రిన్సిపల్‌గా పని చేస్తున్నారు.. నర్సింగ్ విద్యారంగానికి ఉపయోగపడేవిధంగా మేనేజ్‌మెంట్ ఫర్ నర్సింగ్, టెక్ట్స్‌బుక్ ఆఫ్ చైల్డ్ హెల్త్, టెక్ట్స్‌బుక్ ఆఫ్ నర్సింగ్ ప్రొసీజర్ తదితర పుస్తకాలను కూడా ఆమె రచించి నర్సింగ్ విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. నర్సింగ్ విద్యారంగంలో డాక్టర్ పద్మజ చేస్తున్న విశిష్టసేవలకు గుర్తింపుగా భారతప్రభుత్వం ఆమెను ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేయడంతో జిల్లాపేరు ఢిల్లీలో సైతం మార్మోగింది. త్వరలోనే ఆమె భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా ఈ అపూర్వమైన అవార్డును అందుకోనున్నారు. తొలినుంచి సేవాభావం, ఆధ్యాత్మిక భావాలు కలిగిన డాక్టర్ పద్మజ తిరుపతి స్విమ్స్‌లో వైద్యునిగా పనిచేస్తున్న ఆమె భర్త డాక్టర్ మునుస్వామి సహకారంతో చిన్నమాంబట్టులో అనేక దైవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాంబట్టులోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి, అక్కడ అన్నదాన సత్రం నిర్వహణకు ఆమె తనవంతు సేవలందిస్తున్నారు. డాక్టర్ పద్మజకు జాతీయస్థాయిలో ఈ విశిష్టమైన అవార్డు లభించడం పట్ల తడ మండలంలోని ప్రజలేకాక, సింహపురిసీమ ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష పూజలు

మండల కేంద్రమైన సంగంలోని తిరుమనకొండపై కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఈనెల 3న శ్రీ రాజరాజేశ్వరానందస్వామీజీ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. తొలుత అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ఎంతో విశిష్టమైన షోడశ మహాలక్ష్మి పూజలు నిర్వహించి భక్తులందరినీ ఆశీర్వదించారు.

# అందరినీ కాపాడే అమ్మ.. అల్లూరు పోలేరమ్మ

***పిలిస్తే పలికే తల్లి..అందరినీ చల్లగా కాపాడే అమ్మ..అల్లూరు పోలేరమ్మ. అల్లూరు గ్రామదేవతగా, భక్తుల కష్టాలు కడతేర్చి.. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా, దుష్టశక్తుల నుంచి ప్రజలను కాపాడే శక్తిస్వరూపిణిగా పోలేరమ్మ అమ్మవారు ఎంతో ప్రసిద్ధి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అల్లూరుపేటలో కొలువై ఉన్న ఆ చల్లనితల్లి లక్షలాది మంది భక్తులకు ఆరాధ్య దైవంగా భాసిస్తోంది. అమ్మవారికి నిత్యపూజలతో పాటు ఏటా జనవరి నెలలో అత్యంత వైభవంగా జరిగే అమ్మవారి జాతరకు జనం ఇసకేస్త రాలనంతగా వస్తుంటారు. ఎంతో మహిమగల ఈ ఆలయానికి తరతరాల నాటి ఆసక్తికరమైన చరిత్ర కూడా ఉంది.***

అల్లూరు పోలేరమ్మంటే మహిమాన్వితమైన శక్తిదేవత. అల్లూరు గ్రామదేవతగా..దుష్టశక్తులను పారద్రోలే ఉగ్రరూపిణిగానే కాక.. భక్తుల పాలిట కరుణామయిగా అమ్మవారు ప్రసిద్ధి. ఆ చల్లనితల్లి అనుగ్రహం లభిస్తే చాలు..కొండంత కష్టాలైనా ఇట్టే మటుమాయమవుతాయి. గ్రహబాధలు, వ్యాధులు గ్రామంలోకి రాకుండా తరిమికొట్టడమే కాక పంటపొలాలకు చీడపీడలను, పశుగణాలకు రోగాల బాధలను కూడా నివారించే తల్లిగా పోలేరమ్మతల్లి భక్తజనులందరి పూజలందుకుంటోంది.

### ఆలయ చరిత్ర :

ఎప్పుడో కొన్ని తరాల క్రితం అల్లూరు మండలంలోని నార్త్‌మోపూరు గ్రామంలో ఒక రైతు ఇంట్లో అమ్మవారు వెలశారని, ఆ తర్వాత అమ్మవారి ఆదేశానుసారం అల్లూరుపేటలో ప్రతిష్ఠించబడినట్లు పెద్దలు చెప్తున్నారు. అల్లూరుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నార్త్‌మోపూరు గ్రామం అమ్మవారి పుట్టినిల్లు. ఆ గ్రామంలోని రైతు ఇంట్లో ఉన్న తైదుల బుట్టలో ఎంతగా తీసినా తైదులు వస్తూనే ఉండడంతో ఆ బుట్టను కుమ్మరించగా అక్కడ పోలేరమ్మ అమ్మవారి విగ్రహం కనిపించిందని, ఇల్లంతా ఏదో శక్తి ఆవహించినట్లు అనిపించిందని, అప్పుడు తాను శక్తిస్వరూపిణినని, అల్లూరులోని మేడా వారి ఆడపడుచునని, తనను అల్లూరుపేటలో ప్రతిష్టించాలనే మాటలు విన్పించినట్లు చెప్తుంటారు. అమ్మవారి ఆదేశం ప్రకారం అప్పట్లో గ్రామపెద్దగా ఉన్న మేడా లింగారెడ్డి అల్లూరుపేటలో గుడిని ఏర్పాటుచేసి అక్కడ పోలేరమ్మ అమ్మవారిని ప్రతిష్టించినట్లు స్థానికులు చెప్తుంటారు. నాటినుంచి నేటి దాకా ప్రజలను కాపాడుతూ ఆయురారోగ్యాలు ప్రసాదించే దైవంగా అల్లూరు గ్రామదేవతగా పోలేరమ్మ అమ్మవారు ప్రసిద్ధిచెంది లక్షలాదిమంది భక్తుల ఆరాధ్యదైవంగా పూజలందుకోవడం ఎంతో విశేషం. పోలేరమ్మతల్లికి మొక్కుకుని ఏ పని ప్రారంభించినా విజయవంతం అవుతుందని వేరే చెప్పనక్కరలేదు. ఇటీవలి కాలంలో గ్రామస్తులు, భక్తులు, వదాన్యులు, ప్రముఖులు అందరూ కలసి అమ్మవారి ఆలయాన్ని అత్యద్భుతంగా అభివృద్ధిచేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. విశాలమైన ప్రాంగణంలో అద్వితీయమైన రీతిలో పోలేరమ్మ అమ్మవారి ఆలయాన్ని రూపుదిద్ది అమ్మవారి పట్ల తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ ప్రాంగణం ముందుభాగంలో పోలేరమ్మ తమ్ముడు పోతురాజుస్వామి గుడి ఉంది. అదేవిధంగా అల్లూరులోని పలు ప్రాంతాల్లో అమ్మవారి అక్కచెల్లెళ్ళయిన కలుగోళమ్మ, అంకమ్మ, గంగమ్మ దేవతలు కూడా వెలసి ప్రజలను చల్లగా కాపాడుతూ అందరి పూజలందుకుంటున్నారు.





మన దేవాలయాలు (28)

### అంగరంగ వైభవం..
### అల్లూరు పోలేరమ్మ జాతర...

ఎన్నో తరాల నుంచి అల్లూరు పోలేరమ్మతల్లికి నిత్య పూజలు, ఏటా తిరునాళ్ళ వైభవాలు జరుగుతూనే ఉన్నాయి. ఎంతోమంది భక్తులు కొత్తకుండలకు వేపాకుల తోరణాలు చుట్టి అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన చద్దెన్నం, చలిపిండి, పానకాలను తయారుచేసి తీసుకువచ్చి అమ్మవారికి భక్తితో సమర్పించుకుంటారు. ప్రతిఏటా జనవరి నెలలో అంగరంగవైభవంగా జరిగే పోలేరమ్మ గ్రామోత్సవానికి మూడు వారాల ముందునుంచే సంప్రదాయబద్ధంగా చాటింపు వేస్తారు. మూడవ మంగళవారం నాడు మూడవ చాటింపురోజున అమ్మవారికి గ్రామస్తులు చేసే గ్రామోత్సవం (తిరునాళ్ళ) అత్యంత వైభవోపేతంగా ఉంటుంది. అమ్మవారి అలంకారం ఎంతో శోభాయమానంగా ఉంటుంది. అమ్మవారి ఊరేగింపు మంగళవాయిద్యాలు, తప్పెట్లు తాళాల మోతతో దద్దరిల్లిపోతుంది. జాతరంటే..అల్లూరు పోలేరమ్మ జాతరే చూడాలి అన్నంత వైభవంగా ఉంటుంది. జాతర రోజుల్లో అల్లూరులో ప్రతి ఇంటా ఒక పండుగలా ఉంటుంది. దేశంలో అల్లూరోళ్ళు ఎక్కడున్నా జాతరకు అల్లూరుకు వచ్చి పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ.

# మతమంటగట్టి.. మంట పెడుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఈ వృద్ధనేత రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పటివరకు లేని సంస్కృతిని తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. ఇదే జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అప్పుడు లేని మతం చంద్రబాబుకి ఇప్పుడు ఎందుకు గుర్తొచ్చిందో అర్థం చేసుకోవడానికి పెద్ద పరిజ్ఞానం ఏమీ అవసరం ఉండకపోవచ్చు. అప్పుడు చేయని సాహసం ఇప్పుడు చేస్తున్నారంటే.. ఇక రాజకీయ భవిష్యత్ లేదన్న కఠోర వాస్తవం కళ్ళ ముందు జగన్ రూపంలో ప్రత్యక్ష మవ్వడంతో చంద్రబాబు అండ్ కో ఈ స్థాయికి దిగజారి, చివరకు అధికారులకు సైతం మతం అంటగడుతున్నారంటే ఇంతకంటే దుర్మార్గ రాజకీయాలు, ధృతరాష్ట్ర వ్యూహాలు ఎక్కడా ఉండక పోవచ్చు.

## కుట్రపూరితంగా..

జగన్ చెప్పినట్టు రాష్ట్ర ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రతీ పథకానికి ప్రచారం రాకుండా, ఆ పథకాల ప్రారంభోత్సవాలకు ఒకరోజు ముందో, వెనకో రాష్ట్రంలో ఏదో ఒక గుడిలో ఇలాంటి దుశ్చర్య జరుగుతూనే ఉంది. అదికూడా రాష్ట్రంలోని లక్షల గుడులలో ఏమాత్రం ఫోకస్ లేని, జన సంచారం లేని గుడులను ఎంపిక చేసుకొని కొందరు విగ్రహాల విధ్వంసాలకు పాల్పడుతున్నారంటేనే దాని వెనుక పరమార్థం ఇట్టే పసిగట్టేయొచ్చు. వైసీపీ సీనియర్ నేత విజయసాయిరెడ్డి ఆరోపించినట్లుగా విగ్రహాల ధ్వంసం జరిగిందన్న విషయం బయటి ప్రపంచానికి తెలియక ముందే, ఇంకా చెప్పాలంటే ఆ ధ్వంసం అయిన గుడులు తెరుచుకోకముందే టీడీపీ నేతలు అక్కడకు చేరుకుని ధర్నాలు చేయడం, ఎల్లో మీడియా వామ్మో అన్యాయం జరిగిపోయిందంటూ విషప్రచారం చేయడం గమనిస్తే.. ఇది పక్కా ప్రణాళికతోనే జరుగుతుందేమో అన్న అనుమానాలు అశేష ఆంధ్రా వాసుల్లో నెలకొని ఉన్నాయి.

ప్రభుత్వం ఏదైనా సంక్షేమ కార్యక్రమం ప్రకటిస్తే ఆరోజే ఒక కీలకమైన గుడి ఎంపిక చేసుకొని విధ్వంసానికి పాల్పడుతున్న వైనాన్ని చూస్తుంటే.. ఇది కుట్రపూరితంగా జరుగుతున్న దుశ్చర్యగా స్పష్టమైపోతోంది.



## పోలీస్ వైఫల్యం..

ఇక్కడ ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అసమర్థతని కూడా ప్రశ్నించక తప్పదు. రాష్ట్రంలో ఈ స్థాయిలో విగ్రహాల విధ్వంసం జరుగుతుంటే ఇప్పటివరకు చిన్న క్లూ కూడా బయట పెట్టలేకపోతున్నారంటే ఖచ్చితంగా ఇది ఆ శాఖ వైఫల్యమే. జరుగుతున్న దారుణాలకు ప్రత్యక్షసాక్షులుగా సాధారణ జనంతో పాటు పోలీస్‌శాఖ కూడా గుడ్లప్పగించి చూస్తుండడం వల్లే ప్రభుత్వంపై మచ్చ పడుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. జన సంచారం లేని ప్రాంతాల్లో ఉండే గుడులే కావొచ్చు, అయినప్పటికీ ఇప్పటివరకు పదుల సంఖ్యలో జరిగిన ఘటనల్లో ఒక్కటంటే ఒక్క సంఘటనలో కూడా కనీసం నిందితులను కనిపెట్ట లేకపోయారంటే బాధ్యత ఎవరిది? ఖచ్చితంగా పోలీస్ శాఖదే! కనీసం పొరుగు రాష్ట్రం అయిన తెలంగాణ పోలీస్‌ని చూసైనా మన వాళ్ళు స్ఫూర్తి పొందాలి. నిన్నటికి నిన్న జరిగిన ఒక సంచలనమైన కిడ్నాప్ కేసులో గంటల వ్యవధిలో నిందితులను గుర్తించి, అరెస్ట్ చేసి జైలుకు పంపేశారు. కానీ మన రాష్ట్రంలో ఒకటా, రెండా.... అంతర్వేదిలో రథం తగలబెట్టిన సంఘటనలో సైతం ఇప్పటివరకు నిందితులను గుర్తించలేదు... నిందితులు ఎంత తెలివిగా నేరం చేసినా వాటిల్ని పసిగట్టే సమర్థత సత్తా పోలీస్‌కే సొంతం. కానీ ఆ చాకచక్యం, సాంకేతికత, చిత్తశుద్ధి మచ్చుకు కూడా ఇక్కడ కనిపించకపోవడం నిజంగా జగన్ ప్రభుత్వ దౌర్భాగ్యమే. ఈ నిజం గ్రహించో, ఏమో కానీ దేవుడే ఈ శక్తుల్ని శిక్షిస్తాడు అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు సైతం విమర్శలకు గురయ్యాయి.

## రాజకీయ రంగు..

తాజాగా జరిగిన రామతీర్థం సంఘటన విషయానికే వస్తే... అది రామతీర్థానికి ఎదురుగా ఉన్న బోడికొండపై ఉన్న కోదండరామ విగ్రహం, రామతీర్థం నుంచి 5 కిలోమీటర్లు కొండ ఎక్కి పైకి వెళ్ళాలి. ఒక్క శ్రీరామనవమి రోజు తప్ప ఆ కొండపై ఎప్పుడూ జనసంచారం ఉండదు. ఈ సంఘటన తర్వాత కొండెక్కిన ఏ ఒక్క రాజకీయ నాయకుడూ వాళ్ళ జన్మలో గతంలో ఆ కొండెక్కిన పాపాన పోయుండరు. పూజారులు కూడా ఎప్పుడో ఒకసారి వెళ్లి ధూప దీప నైవేద్యాలు పెట్టి వస్తుంటారు, మిగతా సమయాల్లో అసాంఘిక శక్తులు, అశ్లీల కార్యక్రమాల అడ్డాగా ఆ ప్రాంతం ఉంటుంది. అలాంటి చోట ఒక ఉన్మాది కోదండరాముడి తల కోసేసి పక్కనే ఉన్న పుష్కరిణిలో పడేశాడు. దానిపై విచారణ జరుగుతోంది. ఖచ్చితంగా ఇది బాధా కరమే, ప్రతి ఒక్కరి గుండెని పిండేసిన ఘటనే, సెంటి మెంట్‌తో కూడుకున్న విషయం... కానీ ఇలాంటి సున్నిత అంశం పట్ల ఈ స్థాయిలో రాజకీయం చేయడం గతంలో ఎన్నడూ లేదు. అక్కడికి కూత వేటు దూరంలో ఉన్న నెలిమర్లలో జూట్ మిల్లు మూత పడి వేలాది కార్మికులు రోడ్డునపడి ఎప్పటినుంచో దీక్షలు చేస్తున్నారు, ఆ కార్మికులను ఏనాడూ ఒక్క నాయకుడు కూడా పరామర్శించలేదు. ఇంతకు మించి రాష్ట్రంలో అనేక ప్రజా సమస్యలు ఉన్నాయి. వాటిపైన చంద్రబాబు కానీ, బీజేపీ కానీ జనసేన కానీ ఏనాడూ ఈ స్థాయిలో పోరాటం చేయలేదు... వీళ్ళ దుర్నీతిని అర్థం చేసుకోలేని స్థితిలో ప్రజలు ఉండరు. కానీ సాటి మతాన్ని గౌరవించే ఔన్నత్యాన్ని మరచి విధ్వంస కర, వినాశక రాజకీయాలు చేస్తోన్న బాబు అండ్ కోతో పాటు బీజేపీ, జనసేన వ్యూహాలకు తాత్కాలిక ప్రచారం లభించినా, శాశ్వత భంగపాటు మాత్రం ఖాయమన్నది విశ్లేషకుల అంచనా.

ఇవన్నీ చూస్తుంటే ఉత్తరప్రదేశ్‌లో పార్టీలకు ట్రంప్‌కార్డుల్లాంటి కులమతాలను ఏపీలోనూ ప్రయోగించేందుకు కొన్ని పార్టీలు వ్యూహ రచన చేస్తున్నాయా.. వ్యూహాత్మకంగానే సీఎం జగన్ కులాన్ని, మతాన్ని ప్రస్తావిస్తున్నాయా, మెజారిటీవర్గాన్ని ఆకర్షించేందుకు ఘాటైన వ్యాఖ్యలు చేస్తున్నాయా, యూపీలో సక్సెస్ అయిన కులం, మతం ఫార్ములా ఏపీలో ఓట్లు రాలుస్తుందా లేక బూమరాంగ్ అవుతుందా? అన్న చర్చ సాగుతోంది. కానీ ఏపీలో కులమే రాజకీయం చేస్తుంది కానీ మతం ఎలాంటి ప్రభావం చూపబోదు అన్న వాస్తవాన్ని రాజకీయ పార్టీలు గ్రహించాలి. ఎవరెన్ని అన్నా అభివృద్ధే నా కులం, మానవత్వమే నా మతం అని ఇప్పటికే స్పష్టం చేసిన జగన్‌ని ఈ మత రాజకీయాలు ముట్టుకో లేవన్నది మాత్రం ఖాయం.

జగన్‌కి వస్తున్న ఆదరణ, పరిపాలనలో ఆయన చూపిస్తున్న దక్షత, ప్రజలలో ఆయనకు లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని వారు ఈర్ష్యతో, కడుపు మంటతో "మతమంటగట్టి మంటలు రేపుతున్నారన్నది" సర్వత్రా వినిపిస్తున్న మాట!

# కళ్యాణ వైభవం...!




కోవూరు వాస్తవ్యుడు, హైదరాబాద్ నివాసి ప్రముఖ బిల్డర్ సన్నపరెడ్డి మధుసూదనరెడ్డి - ఉమల కుమార్తె **హర్షిత - కనిష్క** (మంత్ర శివానందరెడ్డి - ఉమల కుమారుడు)ల వివాహం ఇటీవల హైదరాబాదులో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.




ఆదర్శ్ గ్రూప్ యజమాని, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ యస్.రాఘవేంద్రషెట్టి - సరితల కుమార్తె **నేహ - రక్షిత్**ల కళ్యాణం ఇటీవల కర్నాటకలోని ఉడిపిలో జరిగింది. నవ దంపతులకు లాయర్ శుభదీవెనలు.

### ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం అంతా

# ప్రతిపక్ష నేత చంద్రబాబు కుట్రే

**బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే అక్కసుతో కొందరు ఆలయాలపై దాడులు, విగ్రహాల విధ్వంసం లాంటి చర్యలకు పాల్పడుతున్నారు' అని బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి అభిప్రాయపడ్డారు. ఈ దాడుల వెనుక చంద్రబాబునాయుడు ఉన్నారని ఆయన ఆరోపించారు. ఒక జాతీయ చానల్ నిర్వహించిన చర్చలో పాల్గొన్న సుబ్రహ్మణ్యస్వామి మాట్లాడుతూ చంద్రబాబు తెరవెనుక ఉండి ఇదంతా చేయిస్తున్నారని చెప్పారు. ఏపీలో పరిణామాలపై సుబ్రహ్మణ్యస్వామి ఏం చెప్పారో ఆయన మాటల్లోనే...

## తిరుమలలో వైఎస్ జగన్ పూజలు చేశారు..

ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాలపై దాడుల ఘటనలపై పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రిస్టియన్ అని విమర్శిస్తున్నారు. ఆయన క్రిస్టియన్ ఎలా అవుతారు? వైఎస్ జగన్ తిరుమలలో తెల్లవారుజామున 2 గంటలకు పూజలు చేశారు. కానీ ఆయన దాన్ని తన ప్రచారం కోసం వాడుకోలేదు. టీటీడీ ఆదాయ వ్యయాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)తో ఆడిట్ చేయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకున్నారు. ఇలాంటి నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి దేశంలో వైఎస్ జగన్ ఒక్కరే. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నదంతా చంద్రబాబు కుట్ర. సోనియాగాంధీ(కాంగ్రెస్)తో కలసి పోటీచేస్తే ప్రజలు ఎవరూ ఆయన వైపు చూడలేదు. అందుకే ఆయన హిందుత్వాన్ని వేదికగా చేసుకుంటున్నారు. టీటీడీలో క్రైస్తవులకు ఉద్యోగాలు ఇచ్చారంటూ పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేశారు. దీనిపై నేను విచారించా. టీటీడీలో కేవలం ఏడుగురే అన్యమతస్తులు ఉన్నారు. వారు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియమితులైనవారు కాదు. అంతకు ముందు ప్రభుత్వంలో నియమితులైనవారే. వారిని కూడా వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్లోకి బదిలీ చేసింది. ఇక ముందు టీటీడీలో హిందూయేతరులను నియమించరాదని విధాన నిర్ణయం కూడా తీసుకున్నారు. టీటీడీ చైర్మన్‌గా వైఎస్ జగన్ తన బంధువు వైవీ సుబ్బారెడ్డిని నియమిస్తే ఆయన క్రిస్టియన్ అని, ఆయన భార్య క్రిస్టియన్ మిషనరీ అని దుష్ప్రచారం చేశారు. వారిద్దరూ నరేంద్ర మోదీ కంటే కూడా పక్కా హిందువులు. అలాంటి వారిపై దుష్ప్రచారం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతోందో పోలీసులను అడగండి. ఆలయాలపై దాడులు చేసినవారిపై కేసులు నమోదు చేశారో లేదో చెబుతారు. అంతేగానీ బీజేపీ నేతలనో, కార్యకర్తలనో అడగవద్దు. ఈ విషయంలో ఎలాంటి చర్చకైనా నేను సిద్ధం. ఉత్తరాఖండ్‌లో బీజేపీ ప్రభుత్వం అన్ని దేవాలయాలను స్వాధీనం చేసుకుని ముఖ్యమంత్రినే అన్ని ఆలయాలకు చైర్మన్‌గా ప్రకటించడంపై కోర్టులో కేసు వేశా. ఆస్తులపై అధికారమంతా ఆలయాలదేనని న్యాయస్థానం పేర్కొంది. కేసు ఇంకా విచారణలో ఉంది.

### కరోనా దెబ్బతో..

# వాహనాల దూకుడు తగ్గింది

- గత ఏడాదిలో ప్రమాదాలు కొంచెం తగ్గాయి
- పోలీసుల సేవలు విస్మరించలేనివి

కరోనా వ్యాధి నేపథ్యంలో.. లాక్‌డౌన్‌ల ప్రభావంతో గత ఏడాది జిల్లాలో వాహనాల దూకుడు తగ్గింది. కొన్ని నెలలపాటు వాహనాల రాకపోకలు బాగా తగ్గిపోవడంతో ప్రమాదాల సంఖ్య కూడా తగ్గింది. ఈ విషయంలో కరోనా ఒకరకంగా మేలే చేసిందేమో!.. 2020 డిసెంబర్ చివరి వారం ప్రారంభం నాటికి జిల్లాలో 1093 రోడ్డు ప్రమాదాలు జరిగి, 477 మంది మరణించారు. ఈ ప్రమాదాల్లో 1127 మంది గాయపడ్డారు. 2019 సంవత్సరంతో పోలిస్తే ఈ సంఖ్య బాగా తగ్గినట్లే. 2020లో రోడ్డు ప్రమాదాలు 15శాతం దాకా తగ్గాయని, అదేవిధంగా మరణాలు 11శాతం, ప్రమాదాల బారినపడిన వారి సంఖ్య 26 శాతం దాకా తగ్గిపోయాయని అధికారవర్గాల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. లాక్‌డౌన్ రోజుల్లో పోలీసులు రోడ్లమీదనే ఎక్కువ సమయం విధుల్లో ఉంటూ వాహనాలను అదుపుచేయడం వల్ల ప్రమాదాలు తగ్గడమే కాక, పోలీసు గస్తీలతో నేరాల సంఖ్య కూడా బాగా తగ్గుముఖం పట్టింది. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అన్నివిధాలుగా ప్రజలకు ఉపయోగపడుతోంది. క్లిష్టమైన ఎన్నో కేసులను జిల్లా ఎస్పీ నేతృత్వంలో జిల్లా పోలీసుశాఖ ఛేదించి అందరి ప్రశంసలు అందుకుంటోంది.

## స్ఫూర్తిదాయకంగా నిలిచిన జిల్లా పోలీసులు

ఈ కరోనా కష్టకాలంలో ప్రజలు ఆ మహమ్మారి వ్యాధి బారినపడకుండా కరోనా వ్యాప్తిని నియంత్రించేందుకు వైద్యులు, వైద్యసిబ్బందితో పాటు రేయింబవళ్ళు రోడ్లపై పహరా కాస్తూ కరోనా కట్టడికి ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను తాము పాటిస్తూ, ప్రజలు కూడా పాటించేలా చేస్తూ కరోనా వ్యాప్తిని నియంత్రించేందుకు మన జిల్లా పోలీసులు ప్రాణాలకు తెగించి చేసిన సేవలను జిల్లా ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు. కరోనాను నియంత్రించడంలో, బాధితులను ఆదుకోవడంలో, రోడ్లపై రోజుల తరబడి అత్యంత నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలను కాపాడడంలో, తమలో కూడా కొందరికి కరోనా వచ్చినా అధైర్యపడకుండా కరోనాను జయించి వెంటనే తిరిగి విధుల్లోకి వచ్చి ప్రజలకు సేవలందించడంలో.. అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిన జిల్లా పోలీసుశాఖ సేవలు ఎంతైనా అభినందనీయం. కరోనా కష్టకాలంలోనూ, ఇటీవలి నివర్ తుఫాన్ సమయంలోనూ ప్రజలను ఆదుకున్న పోలీసులందరికీ హ్యాట్సాఫ్!..ముఖ్యంగా జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్‌కు, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతాభినందనలు!..వారందరికీ నూతన సంవత్సర శుభాభినందనలు కూడా!...

# అయోధ్య రామమందిరానికి విరాళాలివ్వండి

ఎంతో చరిత్రాత్మకమైన అయోధ్య రామమందిరం నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, రామమందిరం నిర్మాణానికి తమవంతు విరాళాలివ్వాలని ఆర్ఎస్ఎస్ నెల్లూరు విభాగ్ సంఘ్‌చాలక్ పల్లాటి రామదండు విజ్ఞప్తిచేశారు. ఈనెల 4న నెల్లూరులోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరూ రామమందిరం నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈనెల 14 నుంచి 31వతేది వరకు జిల్లాలోని సమితి సభ్యులు, రామసేవకులైన కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి విరాళాలు సేకరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన శ్రీరామ జన్మభూమి మందిర నిర్మాణ నిధి సమర్పణ అభియాన్ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సమావేశంలో వేదగిరి ఆశ్రమం నిర్వాహకులు మహేశానందస్వామి, సింహపురి వైద్యసేవా సమితి ట్రస్టు ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా సంచాలక్ సుబ్బారావు, భజరంగ్‌దళ్ నెల్లూరు విభాగ్ సంయోజక్ శశికుమార్ పాల్గొన్నారు.



## మాటరాని మౌనమిది

చిరునవ్వుల వరమడిగావు
కన్నీటితో సాగనంపుతున్నాము
గుండె మీద చేయి వేసుకొని
మాటరాని మౌనమిది అన్నావు
ఆ గుండెనే చేయిచ్చింది ఇవాళ
అక్షరాలు యాబైయ్యారు దుఃఖనది
పడవలై స్వర సాగరంలో సంగమిస్తున్నాయి
శృతిలయలు సంగతులన్నీ
భైరవిని ఆశ్రయించి రోదిస్తున్నాయి
నువ్వు లేవన్న దిగులు నిండి
శోకసాగరమైంది.
పినాకినీ తీరమంతా
నీ కవితల అలలు వొడ్డును వొరుసుకుంటూ
నీ కోసం చిన్న చిన్న జోలలు పాడుతున్నాయి
నువ్వెక్కడ నుంచి ఎక్కడికెళ్లినా
మరుజన్మకు తోడొస్తావని ఆశ!

**- ఈతకోట సుబ్బారావు**
నెల్లూరు.

### భక్తిశ్రద్ధలతో అల్లూరులో

# గ్రామదేవతల జాతర

అల్లూరులో గ్రామదేవతలైన పోలేరమ్మ, గంగమ్మ, కలుగోళమ్మ అమ్మవార్ల జాతర ఈనెల 5న మంగళ వారం నాడు ఎంతో వైభవోపేతంగా జరిగింది. అక్క చెల్లెమ్మలైన ఈ ముగ్గురు గ్రామదేవతలను గ్రామ ప్రజలందరూ ఎందరో భక్తిభావంతో ఆరాధిస్తూ పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా ఎంతో వేడుకగా జరిగిన ఈ గ్రామోత్సవంలో ప్రజలు, మహిళాభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మూడు ఆలయాలను విద్యుద్దీపా లతో, పూల అలంకరణలతో శోభాయమానం చేశారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి శివప్రియ స్థానిక మహిళాభక్తులతో కలిసి వేపమండలు, పూలతో అలంకరించిన సద్దికుండలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి తూర్పువీధిలోని మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద ఉన్న పోలేరమ్మచెట్టుకు ప్రదక్షిణలు చేశారు. అక్కడ నుంచి సామూహికంగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్ళు పొంగించి అమ్మవారికి ఎంతో భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించుకున్నారు. గ్రామోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు పోలేరమ్మ అమ్మవారిని బంగారు చీరతో శోభాయమానంగా అలంకరించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో నేత్రపర్వంగా జరిగిన ఈ జాతరలో పెద్దసంఖ్యలో ప్రజలు, దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

వీక్షణం - మంజీర

# బోడిగుండు రాజకీయం

అది కొండవీడు కోట. గత ఏడాది చివరిరోజుకు ఒక రోజు ముందు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయం. ఆ ఆలయానికి ఎదురుగా ఆలయ ప్రాంగణంలోనే ఒక చిన్న పిక్‌నిక్‌లాంటి సరదా సమావేశం. పదిమంది ఒక చోట చేరిన తర్వాత సరదాగా ఆటలు, పాటలు ఉంటాయి. నిజమే... ఆ ఆటాపాటలు మత ప్రవచనాలు కానంత వరకు ఎవరికీ ఎటువంటి అభ్యంతరమూ ఉండదు. అలాగే ఒక సమావేశం, పాటలు మరొక మతానికి చెందిన ప్రాంగణంలో కానంత వరకు కూడా ఎవరికీ అభ్యంతరం ఉండదు. మనది సెక్యులర్ కంట్రీ. ఎవరికి నచ్చిన మతాన్ని వారు అవలంభించవచ్చు. అయితే ఆ మత స్వేచ్ఛకు కొన్ని పరిధులు కూడా ఉన్నాయి. ఒకరి మత స్వేచ్ఛ ఇతర మతస్థుల మనోభావాలకు విఘాతం కలిగేదిగా ఉండకూడదు. వాక్‌స్వాతంత్ర్యం లాంటిదే ఇది కూడా. మనకు మాట్లాడే స్వేచ్ఛ ఉంది, కానీ ఇతరులను నొప్పించే స్వేచ్ఛ ఉండదు. ఇది ప్రాథమిక హక్కులు మనకు కల్పించిన స్వేచ్ఛలకు రాజ్యాంగం విధించిన పరిధి ఇది. ఈ పరిధి దాటకూడదు. దాటే ప్రయత్నమూ చేయకూడదు. పరిధి దాటే ప్రయత్నం, ఇతరులను నొప్పించే ప్రయత్నం కూడా. ఇతరులను నొప్పించడం అనేది ప్రయత్నపూర్వకంగా జరిగి ఉండకపోవచ్చు. అయితే పరిధి దాటే ప్రయత్నం పరిణామాలు ఇతరులను నొప్పిస్తాయనడంలో సందేహం లేదు. ఆ నొప్పించడం జరిగిపోయింది. ఆ సమావేశంలో ప్రభువు కరుణామయతత్వానికి అద్దం పట్టే పాటలు పాడుకున్నారు. ఆలయంలో పూజలకు వచ్చిన అయ్యప్ప మాలధారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అభ్యంతర పెట్టడానికి నువ్వెవరంటూ పాటలు పాడిన వాళ్లలో కొందరు విరుచుకు పడడమూ జరిగిపోయింది. అత్యంత సున్నితమైన అంశం. 'ఇది మత ప్రచారం కాదు, మా సరదా సమావేశం మాత్రమే. ఇక్కడికి వచ్చిన తర్వాత ప్రేరణ కలిగింది. అంతే' అని వాళ్లిచ్చిన వివరణ ఎందరిని సమాధాన పరిచిందో తెలియదు. సమాధానపడిన మెదళ్లకంటే గాయపడిన మనసులే ఎక్కువ అనడంలో సందేహం లేదు. కొండవీడు కోట ప్రాంగణం వైశాల్యం నాలుగైదు చదరపు కిలోమీటర్లు ఉంటుంది. 'అంత వైశాల్యం ఉండగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోనే సమావేశం కావాల్సిన అవసరం ఏంటి? దీని వెనుక దురుద్దేశం ఉంద'ని సందేహాలు పుట్టుకొచ్చాయి. ఏ ఉద్దేశమూ లేకపోతే పిక్‌నిక్‌కి మైకులతో వస్తారా' అని ప్రశ్నలు కూడా రేకెత్తాయి. ఇది మాత్రమే కాదు. ఇటీవల రాష్ట్రంలో కొంచెం అటూఇటూగా ఇలాంటివి ఎన్నో. దాని మీద సాగుతున్న రాజకీయ ఉద్రిక్తతలు మరెన్నో. బోడిగుండుకి మోకాలికీ ముడిపెట్టి రాజకీయపార్టీలకు మంచి మైలేజ్‌నిస్తున్నాయి.

## రామ రామ

విజయనగరంలోని నెలిమర్ల మండలం రామతీర్థం అట్టుడికిపోతోంది. రామతీర్థంలోని ప్రసిద్ధ దేవాలయం తెలుగు రాష్ట్రాలకు పరిచయమైంది. ఉత్తరాంధ్ర అయోధ్యగా ప్రసిద్ధి చెందిన దేవాలయం అది. అయితే విగ్రహాలను ధ్వంసం చేశారనే ఆరోపణతో వివాదం వెలుగులోకి వచ్చింది. నిజానికి ఈ సంఘటన చోటుచేసుకున్నది బోడికొండ మీదున్న కోదండరామస్వామి ఆలయంలో. ఆలయం ఏదైనా కానీ విగ్రహాల ధ్వంసం మాత్రం సహించదగినది కాదు. చరిత్రలో బహమనీ సుల్తానులు కట్టకట్టుకుని విజయనగర రాజుల మీద దండెత్తి రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజ్యాన్ని స్వాధీనం చేసుకుని అంతటితో ఊరుకోక నెలల పాటు రాజ్యంలో ఉండిపోయి ఆలయాల విధ్వంసానికి పాల్పడ్డారు. నాటి చారిత్రక మత అసహనానికి ఆనవాళ్లుగా ఛిద్రమైన విగ్రహాలు హంపిలో నేటికీ కనిపిస్తాయి. ఆ పాఠాలు చదివినప్పుడు ఇతర మతం పట్ల అంతటి అసహనం అవసరమా? అనిపించి ఉంటుంది. అప్పటి లాగ మూకుమ్మడిగా కాకపోయినా నిగూఢంగా పరమత అసహనం బహిర్గతం అవుతోంది. ఆనాడు విధ్వంసానికి పాల్పడినది ఎవరనే విషయంలో ఎటువంటి ముసుగూ లేదు. సెక్యులర్ కంట్రీ కాబట్టి ఇప్పుడు ఎవరూ ఈ చర్యలకు కారకులం తామని ప్రకటించుకోరు. ఎవరు ఏ ముసుగులో ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారనేది బ్రహ్మపదార్థంగా మిగిలిపోయేటట్లుంది.

## ఎవరి ధార్మికత వారిదే

తిరుమల కొండ మీద శిలువ ఆకారాన్ని తలపించే అలంకరణ పూర్ణకుంభం అని ఒకసారి కలశం అని ఒకసారి సర్ది చెప్పుకోవాల్సిన అవసరం ఎందుకొస్తోంది? మత విశ్వాసాలు అత్యంత సున్నితమైనవి. ధార్మిక సంస్థల్లో అన్యమతస్థులను ఉద్యోగులుగా చేర్చుకోవడం పట్ల నిబంధనలు ఎక్కువగా పాటించడం కూడా అందుకే. అయితే రాష్ట్రంలో జరుగుతున్న విగ్రహాల విధ్వంసం, ఆలయంలో రథాల దహనం... జరిగిపోతున్నాయి. దొంగతనం జరిగితే అందులో ఎటువంటి సందేహం ఉండదు... అది కేవలం దొంగల పనే అయి ఉంటుంది. అది ఆలయం లోపలి వ్యక్తులు కావచ్చు, బయటి వ్యక్తులు కూడా కావచ్చు. అయితే విగ్రహాల మీద దాడి చేయడం వెనుక ఉన్నది పెద్ద సాహసమే. ఇది రాజకీయ ప్రయోజనం కోసం చేయగలిగిన సాహసం అయి ఉండదు. తమ నాయకుడి కోసం రక్తం చిందించడానికి సిద్ధమైన అనుచరులు కూడా తమ మతం, దేవుడి మీద భక్తి విశ్వాసాల విషయంలో భిన్నంగా ఉంటారు. హిందువుగా పుట్టిన వ్యక్తి దేవుడికి ఒక దణ్ణం పెట్టేసి గుళ్లో దొంగతనానికి అయినా పాల్పడగలడేమో కానీ, విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి మాత్రం సాహసించడు. చివరకు విగ్రహాలను అక్రమ రవాణాకు పాల్పడే కరడుగట్టిన నేరగాడు కూడా విగ్రహాల ధ్వంసానికి పాల్పడలేదు. అలాగే ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ ప్రతిపక్ష నాయకుడి తెలివితేటలు... ఒక సంఘటన జరిగిన తర్వాత దానిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునే వరకే. ఏ ఘోరమైనా దానంతట అది జరిగిన తర్వాత అందులో మైలేజ్ వెతుక్కోవడమే తప్ప స్వయంగా మతం మీద దాడి చేసే సాహసం ఇన్నేళ్లలో కనిపించలేదు. ఇందులో కర్తలు ఎవరైనా సరే... బాధ్యత మాత్రం ప్రభుత్వానిదే. తప్పదు... తాము సెక్యులర్ అని నిరూపించుకోవాల్సిన అవసరం ప్రభుత్వంలోని పెద్దలకు ఏర్పడింది. అందుకే కావచ్చు... గత ప్రభుత్వ హయాంలో కూలగొట్టిన ఆలయాలను కూడా తిరిగి నిర్మిస్తామని మనోభావాల పరిరక్షణకు పూనుకోవాల్సి వచ్చింది. రాజకీయాలను కులం చుట్టూ తిప్పడం, ప్రాంతం పేరుతో విభజన రేఖలు గీయడం... ఈ రెండు సూత్రాలు విజయవంతమయ్యాయి. ఇక తాజాగా తెలుగువాళ్లను మతం చుట్టూ పరిభ్రమింపచేయడం మొదలైంది. ఈ పోకడ ఎటు దారి తీయనుందో?

# వైద్య సేవలందించడంలో.. జిల్లా రికార్డు సృష్టించింది

కరోనా నేపథ్యంలో జిల్లాలోని 30 లక్షలమంది ప్రజల్లో 10 లక్షల మందికి కరోనా పరీక్షలు చేయడం, 75 వేల మందికి చికిత్సలు చేసి ఆరోగ్యంగా కోలుకునేలా చేసి డిశ్చార్జి చేయడంలో రాష్ట్రస్థాయిలో జిల్లా సరికొత్త రికార్డు సృష్టించిందని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 4న ఇందుకూరుపేటలో పిహెచ్‌సి భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసే కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త స్ట్రెయిన్ పట్ల జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు.

# రాష్ట్రంలో మొట్టమొదటి డీ-శాలినేషన్ ప్లాంట్ మన జిల్లాలోనే

- కృష్ణపట్నం లెదర్‌పార్క్‌లో ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు
- సముద్రపు నీరు.. ఇక మంచినీరుగా ఉపయోగపడనున్నాయి

సముద్రంలో నీరు ఉప్పుగా ఉంటాయన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే ఆ నీళ్ళు కూడా ఇక మంచినీరుగా కూడా ఉపయోగపడనున్నాయి. అందుకు రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకుంటున్న చొరవతో సముద్రపు నీటిని శుద్ధి చేసేందుకు (డీ-శాలినేషన్) రాష్ట్ర పరిశ్రమలశాఖ రంగం సిద్ధంచేస్తోంది. ఈ విలక్షణమై ప్లాంట్ రాష్ట్రంలో మొదటి సారిగా మన జిల్లాలోని కృష్ణపట్నం లెదర్ పార్కులో ఏర్పాటుకు చేయడానికి సన్నాహాలు ప్రారంభం కావడం విశేషం. లెదర్ పార్కులో ఏర్పాటుచేసే యూనిట్లకు ఎక్కువగా నీరు కావాల్సివస్తుంది కనుక, పూర్తిగా సముద్రపు జలాలనే శుద్ధి చేసి వినియోగించుకునే విధంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నారు. దాదాపు 536 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ మెగా లెదర్ క్లస్టర్‌కు రోజుకు 10.5 మిలియన్ లీటర్ల నీళ్ళు అవసరమవుతాయని, ఇందుకోసం సుమారు రోజుకు 30.5 మిలియన్ లీటర్ల సముద్రపు నీటిని శుద్ధిచేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు 70 కోట్ల రూపాయలు అవసరమని భావిస్తున్నారు.

ఏదేమైనా సముద్రపు జలాలను మంచినీరుగా ఉపయోగించే నూతన ప్రక్రియ రాష్ట్రంలో తొలిసారిగా మన జిల్లాలోనే ప్రారంభం కావడం విశేషం.







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com